ఆదివారం

ప్రజాశక్తి

డిసెంబర్ 12, 2004

Entered

కథా నిలయం
శ్రీకాకుళం

చలి...చలి...చలికోట్లు

హ్యాపీ బర్త్‌డే

(12-12-2004నుంచి 18-12-2004వరకు)

బన్నీ
2సం॥, 12.12.2002
నీరజ-వెంకటేశ్‌గౌడ్
నర్సాపూర్-మెదక్

ఎస్. లిఖిత్‌కుమార్
3సం॥, 12.12.2001
విజయలక్ష్మి-కృష్ణ
దెబ్బలగూడ-రంగారెడ్డి

రీనా
3సం॥, 12.12.2001
సునీత-గోపి
అంతర్వేది-తూ॥గో

కె. రిషీక్
7సం॥, 13.12.1997
వెంకటలక్ష్మి-వెంకటేశ్వరరావు
కూనవరం-తూ॥గో

వి. నిఖిల్
1సం॥,డిసెంబర్-2003
అనిత-నగేష్
అమెరికా

కె. నందిత
6సం॥, 14.12.1998
శ్రీవిద్య-వెంకటేష్
బెంగుళూరు-కర్నాటక

జి.ఊహాలత
డిసెంబర్-13
లక్ష్మి-చంద్ర
ఆలూరు-కర్నూలు

బుల్టి
1సం॥, 14.12.2003
నళిని-శంకర్
లక్ష్మణచాంద్-ఆదిలాబాద్

కె. రాహుల్‌చారి
1సం॥, 14.12.2003
లక్ష్మి-మోహన్‌చారి
బాపూజీనగర్-హైదరాబాద్

పి. సృజన్
డిసెంబర్-15
పద్మ-రాజ
జిన్నూరు-ప॥గో

లాస్య
డిసెంబర్-16
సుమతి-అనిల్‌కుమార్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

ఎస్. మేఘన
4సం॥, 16.12.2000
స్వప్న-పద్మనాభరావు
తుంగపాటిగౌరారం-నల్లగొండ

కె. సింధు
5సం॥, 16.12.1999
స్నేహలత-రామకృష్ణారెడ్డి
తాడేపల్లి-గుంటూరు

శైలకుమారి
5సం॥, 17.12.1999
దుర్గ-సుదర్శన్
యూసుఫ్‌పేట్-మెదక్

పి. దేటివ్య
చందు-రమేష్
ఫత్తేఖాన్‌పేట-నెల్లూరు

కె. అలేఖ్య
2సం॥, 17.12.2002
అనూరాధ-నాగమల్లేశ్వరరావు
చందోలు-గుంటూరు

కె. ఖుషి
3సం॥, డిసెంబర్-2001
హేమలత-శ్రీనివాసరెడ్డి
నోముల-నల్లగొండ

కె. మానస
సుగుణ-శ్రీనివాసులు
జయంపు-నెల్లూరు

టి.నవీన
7సం॥, డిసెంబర్-1997
శ్రీలత-సంజీవయ్య
నెహ్రూనగర్-హైదరాబాద్

రమ్యతేజ
8సం॥, డిసెంబర్-1996
నిర్మలమేరి-దాస్‌చౌదరి
సీతారాంపురం-రంగారెడ్డి

సిహెచ్. విష్ణుభరత్‌గౌడ్
6సం॥, డిసెంబర్-1998
కనకదుర్గ-పుల్లయ్యగౌడ్
నేలకొండపల్లి-ఖమ్మం

ఆదర్శ్
శారదారమానాయక్-ఆంటోని
లక్ష్మీపురం-నెల్లూరు

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



"సీ డస్ట్‌బిన్!"

28వ తేదీ ఆదివారం సంచిక కవర్‌స్టోరీ సముద్రాలు కాలుష్యాలకు నిలయాలుగా అవుతున్నాయని చక్కగా వివరించింది. నీటిబిందెలో ఒక ఉప్పురాయి వేస్తే అవి తాగవచ్చు. కాని కిలోల కొలది ఉప్పు పోసిన తరువాత అవి తాగలేం కదా! అలాగే అభివృద్ధి పేరిట వెలిసిన పారిశ్రామిక వాడలు కాలుష్యంతో నింపుతున్నాయి. ఫ్యాక్టరీలు వదిలే వ్యర్థ రసాయినాలు కాలువల ద్వారా నదులలోకి, నదుల ద్వారా సముద్రాలలోకి ప్రవేశించి జలచరాలను సంహరిస్తున్నాయి. మానవుడి మేధస్సు కత్తిలా అడవి జంతువులను దునుమాడిన విషయం మరువకముందే ఇప్పుడు సముద్రం కూడా దాని ధాటికి ఒట్టిపోయిన గొడ్డు అవుతోంది. చివరకు సముద్రమే "సీ డస్ట్‌బిన్" అవుతోంది!

-పెండోట వెంకటేశ్వర్లు, బద్దిపడగ

ఆలోచింపజేసింది

కవర్‌స్టోరీ ఆలోచింపజేసింది. ఆ వ్యాసం చదివాక వివిధ సముద్రాలలోని రంగులు, ఏఏ కాలుష్యాల వల్ల సముద్రాలు కలుషితం అవుతున్నాయో తెలుసుకోగలిగాము. కాలుష్య ప్రభావానికి జలచరజీవులైన చేపలు, పీతలు లాంటివి, అనేక రకాల జీవ సంపద ఎలా విలవిలలాడిపోతుందో అనేక విషయాలు తెలుసుకున్నాము. కాలుష్యాన్ని అరికట్టే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాలుష్యనివారణకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తే బాగుంటుందో తెలుసుకున్నాము. ఆరోగ్యం పేజీలో 'చక్కని ఆరోగ్యానికి కలబంద మరియు అలోవిరా' ఎలా పనిచేస్తుందో తెలుసుకున్నాము. ఎన్నో విషయాలు అందించిన ప్రజాశక్తి ఆదివారం అనుబంధానికి అభినందనలు.

-కామిడి సతీష్‌రెడ్డి(టీచర్),
జడలపేట, వరంగల్‌జిల్లా

'వీడిన కొమ్మా...రావమ్మా'

కథ బాగుంది

ఎయిడ్స్ వచ్చిన మనిషి జీవితం ఎంత నరకంగా ఉంటుందో ఈ కథ ద్వారా అర్థమయినది. ఏ తప్పూ చేయని ఒక మహిళ హెచ్ఐవికి గురైతే, ఆమె మిగిలిన జీవితానికి రమణారావు పాత్ర చాలా మంచి పరమార్థాన్ని కలిగించింది. అలాంటివారి పట్ల సభ్యసమాజం ఎలా వ్యవహరించాలో చక్కటి సందేశం ఇచ్చిన కథా రచయితకు అభివాదాలు. అలాగే కవర్‌స్టోరీలో 'కుమిలిపోతున్న సముద్రాలు' గురించి మాకు తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. కలబంద ఆరోగ్యానికి ఎంతమంచిదో తెలుసుకున్నాం.

-కొత్తపల్లి శ్రీవెంకటరమణ,
పెదపళ్ళ, తూ.గో.జిల్లా

కలబంద

ఆరోగ్యం శీర్షికలో ప్రచురించిన కలబంద పుట్టుపుర్వోత్తరాలు, చరిత్ర, దానిని ఉపయోగించే విధానం, దానివలన మనకు కలిగే లాభాలు ఎన్నో మాకు తెలియని విషయాలు తెలుసుకున్నాం.

-చల్లా వెంకటేశ్వర్లు, నార్నెపాడు,
గుంటూరుజిల్లా.

'సోమరి గాడిద'

బాలకథ శీర్షికలోని 'సోమరి గాడిద' ఎంతో ఆసక్తిగా చదివింపజేసింది. సోమరి గాడిద అనేపేరు సంపాదించిన రామప్ప, గాడిదతో ఉపాధి పొంది, దాని ఆధారంగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ జీవితంలో స్థిరపడటమేకాదు, తనకు తిండిపెట్టిన గాడిదను ఎప్పుడూ మరువకపోవడం 'శ్రమయేవ జయతే'ను గుర్తుచేసింది.

-పి రామకృష్ణ, పెద్దశంకరంపేట.

ఆచార్య గంగప్ప

కళాసాహితి పేజీలో ఆచార్యగంగప్పగారితో సంభాషణ నా చిన్ననాటి సంగతులు గుర్తుతెచ్చేలా నన్ను ఆకట్టుకుంది. మా చిన్ననాటి సంగతులు, నవరాత్రుల్లో వేసే నాటకాలు మైళ్ళకొద్దీ దూరం సైకిళ్ళపై వెళ్ళిన రోజులు, పీసపాటి-ఆచంట-వల్లూరి-షణ్ముఖ లాంటివారి నాటకాల రోజులు గుర్తొచ్చాయి. గంగప్పగారి ఇంటర్వ్యూ బాగుంది.

-యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూ.గో.జిల్లా.

జై కిసాన్

కృషితో నాస్తి దుర్భిక్షం అన్నట్లుగా రైతులపాలిట కల్పవృక్షంగా ఓ రైతుయువకుడు సృష్టించిన ఆధునిక బయోటెక్నాలజీ నిజంగా నేటి అవసరం.



విశ్వాస్ మోరే వయస్సులో చిన్నవాడైనా అనుభవంలో మేటి అన్నట్లు సాధించిన ఘనత రైతులోకానికే గర్వకారణం.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాద్, హైదరాబాదు.

మనలో మాట

రాహుకాలం !?!

ఎండాకాలం, వర్షాకాలం, చలికాలం...ఇలా అన్నామనుకోండి. అందరికీ ఇట్టే తెలిసిపోతుంది.

ఎందుకంటే అవి నిత్యజీవిత సత్యాలు కాబట్టి. అంతకుమించి అందరి అనుభవాల్లోకీ వడగాడ్పుల ఎండగా, తడిసిముద్దయ్యేలా చేసే కుండపోతగా, స్వెట్టర్లలోకి, మంటసెగల ముందుకు తోసే చచచ...చ్చలిలా తెలిసిందే కాబట్టి.

ఇదుగో అమ్మాయిలూ...ఆ సరళీస్వరాలు మొదటికాలంలో పాడాక రెండు, మూడుకాలాలు చెబుతాను అని సంగీతంమాస్టార్లు అంటుంటారు.

ఇదీ కొంతలో కొంత సులువుగానే తెలుసుకోగలరు. అదేదో తాళగతులు, రాగజతులకు సంబంధించినదిగా గ్రహించేయగలరు.

"నీ పిదపకాలం రానూ...", "నీకు పోయేకాలం వచ్చేసిందిరా..." అని ఎవరన్నా అనేటప్పుడు వాళ్ళ మొహం చూస్తే చాలు తెలిసిపోతుంది. ఎవరినో తెగతిడుతున్నారనీ, ఆ పిదపకాలం, పోయేకాలం తదితరాలు... తిట్టేవాటికి చెందిన కాలాలని తెలుస్తుంది.

ఇక బడిమాస్టార్లు చెప్పే భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలం అనే కాలాలు గ్రామరుక్లాసులు గుర్తొచ్చేంతగా బుర్రగోక్కుంటేగానీ గుర్తుకురానంతటి కాలాలు.

అసలు విషయానికి వస్తున్నా...రాహుకాలం, పుణ్యకాలం, తిథికాలం అనేవి ముహూర్తాలు, పంచాంగాలకు చెందిన, సామాన్యులకు కాక కొన్ని శిష్టవర్ణాలకు చెందిన పదంలాగా వుండిపోయింది.

కానీ ఇటీవల ఈ రాహుకాలం అనే పదానికి భలే ప్రచారం వచ్చిందిలేండి!

ఆ మధ్య ఒక పీఠాధిపతులవారు(పేరెందుకులేండి...మీకు తెలిసిపోయేవుంటుందికదా!) ఒక హత్యానేరారోపణకు గురై జైల్లో విడిదిచేశారు. వారు యమాగా బీరాలు పలుకుతూ 'నన్ను జడ్జీ ముందుకు తీసుకువెళ్తారేమో...ఈ రాహుకాలంలో నేను కోర్టుకి రానుగాక రాను' అని శలవిచ్చారు. అయినా కోర్టు టైం ప్రకారం రాకతప్పింది కాదనుకోండి! కానీ ఇప్పటివరకూ బెయిలురాక(...అదేలేండి రాహుకాలం పోక!) బయటకే రాలేకపోయారు.

అస్సలు మొదలే...చేయించిన 'యవ్వారం' ఏదో తిథివారనక్షత్రాది సుముహూర్తాలూ, రాహుకేతు గమనాగమనాది దుర్ముహూర్తాలూ చూసుకునే చేసుంటే పోయేది కదా...!

ఏంచేస్తాం "రాహుకాలం!"

❖

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	16
కచేరి . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

జడలో మసాలా వడ

కథ ... 8, 9

సు'దూరదర్శిని'

రియల్ స్టోరీ ... 14, 15



ప్రకృతిలో భాగం జోగ్ జలపాతం

టూరిస్ట్‌గైడ్ . . . 21

'బొమ్మలాట'కు జీవం పోస్తున్న తాతా.... చలపాక ప్రకాష్

కళాసాహితి . . . 22, 23

అప్పుడు నా ఇంగ్లీషు శంకర్ దాదా ఇంగ్లీషు ఇప్పుడు నేను ఇంగ్లీషులోనే దాదా !



శంకర్ దాదా M.B.B.S. సినిమా చూశారా? అందులో మాట్లాడినట్లుగా చాలా కాలంగా నేను ఇంగ్లీషులో మాట్లాడుతుండేవాడ్ని. నేను మాట్లాడే ఇంగ్లీష్ చూసి నా ఫ్రెండ్సు నన్ను ఎగతాళి చేసేవారు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న నాకు ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడక పోవటం ఇబ్బందిగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది.

వివేకానంద ఇన్స్టిట్యూట్‌వారి డైరక్టు కోచింగు క్లాసుకు ప్రతి రోజు ఒక గంట వెళ్ళి 60 రోజులలో సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకున్నాను. ధైర్యంగా చెబుతున్నాను. ఇప్పుడు నేను ఇంగ్లీషులో నిజంగానే దాదా !

పగలు, మధ్యాహ్నం లేక సాయంత్రం ఇలా మీకు అనువైన సమయంలో ప్రతిరోజు ఒక గంట వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌కు రండి. సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకోండి.

ఇంతవరకు 16 లక్షలకు పైబడినవారు శిక్షణ పొంది సరళంగా ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. ఇక మాట్లాడబోయేది మీరే !

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T.Nagar, Chennai-600017.

మీకు దగ్గరలో ఉన్న మా కోచింగు సెంటరులో నేడే సంప్రదించండి

HYDERABAD:

S. R. NAGAR	☎ 23714330
DILSUKHNAGAR	☎ 24044352
VANASTHALIPURAM	☎ 24122464
MEHDIPATNAM	☎ 55755888
A. S. RAO NAGAR	☎ 55497992
NARAYANAGUDA	☎ 55155441
RAJAMUNDRY	☎ 2422003
KAKINADA	☎ 2386638
VISAKHAPATNAM	☎ 2738892
VIJAYAWADA	☎ 5530053
GUNTUR	☎ 2238541
NELLORE	☎ 2327702
THIRUPATI	☎ 2252878
CUDDAPAH	☎ 224445
MIRYALGUDA	☎ 230130
ANANTAPUR	☎ 241029
KURNOOL	☎ 248099
NIZAMABAD	☎ 229047
PRODDATUR	☎ 250550

డైరెక్టు కోచింగు క్లాసులలో చేరలేనివారు మా 'హోమ్ స్టడీ కోర్స్' మూలంగా ఇంట్లో ఉంటూనే తీరిక సమయంలో ఈజీగా ఇంగ్లీషు నేర్చుకోవచ్చు. మొత్తం కోర్సు ఫీజు రూ. 575/- మాత్రమే. (044) 24347034, 24341216 నెంబరుకి ఫోన్ చేస్తే చాలు. కోర్సు పాఠాలు VPP ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వచ్చేస్తాయి.

11 / TEL / 04 / NAGA

కార్టూన్ కదంబం


ఇదిగో చేతికి అందిందిగా...
తెలంగాణ
కమిటీ
ప్రజలు
కాంగ్రెస్
నారు


మండలి బిల్లు


వివాదం
ఎరువుల మంత్రి
రైల్వే మంత్రి
లాలూ-పాశ్వాన్‌ల వివాదం



చలి...చలి...చలికోట్లు



ఎముకలు కొరికే చలి పులి నుండి రక్షించుకోవడానికి ప్రయత్నం చేయకుండా హిమ పవనాలను ఈ హేమంత రుతువులో ఆస్వాదించడం మాట అటుంచి అనుభవించడమూ కష్టమే. పులికి ఉన్న ఆకారం చలికి లేకపోయినా అంతకంటే ఎక్కువగానే మనలను వణికిస్తుంది.

బోరెడ్డి అయోధ్యరెడ్డి

నవంబర్ నెల రెండో పక్షంలో తప్పటడుగులు వేసి, డిసెంబర్లో వేగంగా నడిచి, జనవరి ప్రారంభం నుండి మనిషిని పరుగెత్తించే నిరాకారి ఈ చలిపులి. చలిని నులివెచ్చని అనుభూతిగా మార్చగల కవచం చలికోటు. వీటినే స్వెట్టర్లని కూడా అంటాం కదా! చలి సీజను రాబోతుండగానే మార్కెట్లలో కనబడే సందడే చిన్నా పెద్దా పట్టణాల ఫుట్‌పాత్ జాగాలలో బారులుతీరి పంచ రంగుల కనులవిందు చేసే స్వెట్టర్ల దుకాణాలు.

తెల్లటి శరీరఛాయ, చక్కటి పొట్టిముక్కు, చురుగ్గా చూసే చిన్నిచిన్ని కళ్ళు, ముదురురంగు మిడ్డీ లేదా పొడుగు గౌను డ్రస్సులో నేపాలీ అమ్మాయిలు వచ్చీరాని తెలుగు, హిందీ మాటలతో మనల్ని ఇట్టే ఆకర్షిస్తారు. తమతమ ప్రాంతాలలో తయారుచేసినవో, స్వయంగా అల్లినవో వెంటబెట్టుకుని మన రాష్ట్రానికొస్తారు. నేపాలీలు, అస్సామీలు, టిబెటియన్లు, రాజస్థానీయులు వచ్చి మనకు చలి కవచాలు అందిస్తున్నారు. అవి రగ్గులు కావచ్చు. శాలువాలు కావచ్చు. మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు, స్వెట్టర్లు, ఇటీవలే కొత్తగా వస్తున్న ట్వీట్టర్లు కావచ్చు. "హలో...క్యా...ఎమ్మి కవ్వలీ... స్వెట్టరా...మూ... మూడు వంద...నయ్ నయ్ రెన్నువంద యబై...టూ పిఫ్టీ...కవలా..కవలంటే లేలో...నయ్ నయ్...నహీ అతా..రాదూరాదూ... అచ్చా తీస్కో..." ఇలా వచ్చీ రానీ యాసభాషతో బేరం సాగిస్తారు.

చలి కారణంగా దినచర్యలో తేడాలు రాని వారుండకపోవచ్చు. పిల్లా, తల్లీ, బీదా, బిక్కీ భేదం లేకుండా చలి తీవ్రత ఒకేలా ఉన్నా దాన్నుండి రక్షణ పొందడానికి అనుసరించే మార్గాలు, వనరులు, పరిస్థితులు మాత్రం ఒకే విధంగా లేవు. గ్రామాల్లో ఇప్పటికీ చలి నెగళ్లు వెలుగుతూనే ఉన్నాయి. కరువు ధాటికి వలస వెళ్లిన కుటుంబాల్లో ఇంటివద్ద మిగిలిన వృద్ధులు చలి కుంపట్లతో, చలిమంటలతో చలి నుండి ఊరట పొందుతున్నారు. సంక్రాంతి పండుగకు ఇంటిముందు ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టడం, భోగి మంటలు వెలిగించడం, దానికి ఈ చలికాలపు సందర్భం కావడం ఓ గొప్ప సహజానుభూతి. భూమి మీద మనుగడ సాగిస్తోన్న జంతుజాలమంతా ప్రకృతి సహజంగా రక్షణ పొందుతుండగా, మనిషికి మాత్రం ప్రకృతి నుండి రక్షణ కోసం కృత్రిమ ఏర్పాట్లను చేసుకోకతప్పదు. స్వెట్టర్లు, శాలువాలు, కోట్లు వంటివి

ధరించకుండా బయట తిరగడం ఇప్పటి చలిలో కచ్చితంగా సాహసమే. చలి నుంచి రక్షణ పొందడానికి సామాన్యుని నుంచి సంపన్నుడి వరకు ఎక్కువగా స్వెట్టర్లను ఆశ్రయిస్తున్నారు.

స్వెట్టర్లెలా తయారు చేస్తున్నారు..!?

చొక్కాలా తొడుక్కునేందుకు అనువుగా ఉంటూ మనకు రక్షణ కల్పిస్తున్న స్వెట్టర్లను ఎక్కువగా జంతువుల జుట్టు తోనే తయారు చేస్తారు. గొర్రెలు, కుందేళ్ళు, కొన్ని చెట్ల నార, మృదువైన సింథటిక్ నుంచి దారాలను తయారుచేస్తారు. దారాలను అల్లికల ద్వారా ధరించడానికి అనువుగా రూపొందిస్తారు. జంతువుల జుట్టును కత్తిరించడం, శుభ్రపరచడం, దారాలుగా వడకడం, వాటికి రంగులద్దడం, దారాలతో స్వెట్టర్లను అల్లడం వంటి దశలు దాటి మనకు కనిపించే స్వెట్టరు తయారవుతున్నది. టెక్స్‌టైల్ మిషన్ల ద్వారా కూడా స్వెట్టర్లు, మఫ్లర్లు, మహిళలు వాడే స్కార్ఫ్‌లు తయారవుతున్నవి. స్వెట్టర్లకు ముడిసరుకైన ఉన్ని, ఊలు ఎక్కువగా లభిస్తున్న నేపాల్ వీటికి ప్రధాన కేంద్రం. కుటీర పరిశ్రమగా మనదేశంలో అస్సాం రాష్ట్రంలోనూ వర్ధిల్లుతోంది. అక్కడి నుంచి తీసుకొచ్చి మనరాష్ట్రంలోని అవసరాలను నేపాలీలు తీరుస్తున్నారు.

ఈ చలి ఉడుపులను తమ వెంటగాని, లేదా రవాణా సర్వీసుల పార్శిల్ విధానం ద్వారాగాని తెచ్చుకుంటారు. మన రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన షాపులలో బారులుతీరి కనబడతాయి. హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాలలో కోఠీ బస్టాప్ మూలల్లో, లక్డీ కా పూల్ టర్నింగ్‌ల్లో, మెహదీపట్నం చౌరాస్తాలో, అమీర్‌పేట షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్లలో, గౌలిగూడ చమన్‌లో, నాంపల్లి-సికింద్రాబాద్ స్టేషన్ల వద్ద, మోండా మార్కెట్టులాంటి ముఖ్య మార్కెట్టు కూడళ్ళలో ఈ స్వెట్టర్లు, తదితర చలి దుస్తుల షాపులు ప్రతీ సంవత్సరం ఉంటాయి. విజయవాడ రామాటాకీస్-అలంకార్ సెంటర్, వన్‌టౌన్‌లోను, గుంటూరు ఏ సి కాలేజీ ఎదురు పేవ్‌మెంట్‌ల మీద, విశాఖ జగదాంబ సెంటర్ ఇలా అనేక పట్టణాలలో ఈ నేపాలీ, అస్సామీ తదితర ఛోటా వ్యాపారుల స్వెట్టర్ అమ్మకాలు సాగుతున్నాయి.

ధరలెలా ఉంటున్నాయి..!?

స్వెట్టర్ల నాణ్యతను బట్టి వాటి ధరలుంటాయి. కొంచె పలుచగా ఉండి, హాఫ్ హ్యాండ్స్ ఉండే స్వెట్టర్లకు ధర 60 రూపాయలతో ప్రారంభమౌతున్నది. మధ్యస్తంగా నాణ్యత ఉంటే వంద నుంచి, మందంగా-అందంగా డిజైన్లు చేసిన వాటికి 3 నుంచి 4 వందల రూపాయల వరకు ఉంటున్నాయి. నెలల పాపాయి నుండి పెద్దవారికి వారివారి కొలతలను

బట్టి స్వెట్టర్ల ధరలుంటున్నాయి. షాపులలో షోకేసులు, ఫోకసింగ్ లైట్ల వెలుగుల్లో, ప్యాకింగ్‌ల మెరుపుల్లో అమ్మే స్వెట్టర్లు ఉన్నత వర్గాలకు అందుబాటులో ఉంటాయి. వెయ్యి నుంచి మూడువేల రూపాయల వరకూ రేట్లుంటాయి. అంత స్తోమతలేని మధ్యకు దిగువ మధ్య, పేద జనులు మాత్రం ఈ నేపాలీ, అస్సామీ వారి షాపులవైపే మొగ్గుచూపుతారు. మగవాళ్ళు వాడే కలర్ జాకెట్స్, లూజర్ స్వెట్టర్లు రూ. 160/- నుంచి రూ. 250/- వరకూ ఉండి సామాన్యులకు అందుబాటులో ఉన్నాయనిపిస్తుంది. ప్లెయిన్, జాలీ తదితర రకాలు ఆడవారి ఎంపికలోనివి రూ. 140/- నుంచి రూ. 350/- లలో దొరుకుతున్నాయి. మారుతున్న ఫ్యాషన్‌కు అనుగుణంగా, నేటి యువతరంవారి వినూత్న భావాలకు అనుగుణంగా "ట్విట్టర్లు" అనే కొత్తరకపు స్వెట్టర్లకు ఇప్పుడిప్పుడే గిరాకీ అందుకుంటోంది. భార్యాభర్తల్లో, ఇద్దరు అన్నదమ్ముల్లో, అక్కచెల్లెళ్ళో, స్నేహితుల్లో జంటగా ధరించే ఏక స్వెట్టరయిన ఈ ట్విట్టర్లు ఇటీవలే మన రాష్ట్రానికి పరిచయమవుతున్నాయి. పిల్లలకు చలి నుంచి రక్షణ కల్పించడానికి ఉన్నితో, సెమీ ఉన్నితో, నారతో తయారు చేసిన సాక్స్‌లు, గ్లౌజులు, స్వెట్టర్లు ఇలాంటివి సామాన్యుని మార్కెట్‌లో దొరుకుతున్నాయి. అయితే బేరం చేసే సామర్థ్యం మీద ఆధారపడి ధరలుంటున్నాయనే విషయమూ విస్మరించరానిదే. హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని మిగిలిన ప్రధానపట్టణాల్లోనూ ఈ వ్యాపారాన్ని నేపాలీలు చేస్తున్నారు. రూపం, వేషం, భాష, సంస్కృతితో పూర్తిగా భిన్నంగా ఉన్న మనవారితో మృదువుగా, చాకచక్యంగా వ్యాపారం చేసుకునే తీరు అభినందనీయమే. వినియోగదారుడి ఆలోచన, ఆసక్తి, అభిరుచి, ఆర్థికస్తోమతను అంచనావేసి వారు వ్యాపారం చేయడంలో ప్రదర్శిస్తున్న నేర్పరితనం ఎన్నదగినదే. వంద రూపాయలకు అమ్మేయదలిచిన స్వెట్టరుకు రెండొందలకు పైగా రేటు చెప్తారు. మనం మొహమాటపడి సగానికి అడిగామే అనుకోండి. వారు ఇరవై తగ్గించి ఇంగ్లీషులోనో, హిందీలోనో రేటు చెప్తారు. గరిష్టంగా ఎంతవరకు వినియోగదారుడు భరించడానికి

బెజవాడ చలికి నేపాలి స్వెట్టర్

రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతూ ఉంది. చలి నుండి రక్షణ పొందేందుకుగాను విజయవాడనగర వాసులు చలికోట్ల (స్వెటర్లు)ను ఆశ్రయిస్తున్నారు. దీనితో చలికోట్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. విజయవాడలోని అన్ని వస్త్ర దుకాణదారులు వివిధ చలికోట్లు, బనియన్లు, స్వెటర్లను దిగుమతి చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. వస్త్ర దుకాణాలలో ఎక్కువ రేటు ఉంటుందని కొందరు అంటున్నారు. అందుకే తక్కువరేట్లకు అమ్మే టిబెటన్స్, నేపాల్ వారి షాపులు గుర్తుకు వస్తాయి. గాంధీనగర్‌లోని రామా టాకీసు-అలంకార్ సెంటర్‌ల వద్ద గల ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న టిబెట్ వారి చలికోట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ అన్ని వర్గాలకు చెందిన వారు చలికోట్లు, బనియన్లు, స్వెటర్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ సెంటర్లలో ప్రతి సంవత్సరం విక్రయాలు సాగుతాయి. ఇక్కడికి మణిపూర్, నేపాల్, గుజరాత్, అస్సాం రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఉన్నారు. మరికొందరు నేరుగా టిబెట్ నుంచి వచ్చి విక్రయిస్తున్నారు. గత 18 సంవత్సరాల నుండి ఇక్కడ వ్యాపారాలను నిర్వహిస్తున్నట్లు వారు చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల నుండి వలస వచ్చి ఇక్కడ నాలుగు నెలలపాటు వ్యాపారం చేస్తుంటారు. ఈ ప్రాంతంలో మొత్తం 22 దుకాణాలను ఏర్పాటు చేసుకుని 42 మంది వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరు కుటుంబ సమేతంగా అందర్నీ తీసుకువచ్చి, అక్కడే అద్దె ఇంటిలో ఉంటున్నారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 11 గంటల వరకూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వీరు తెచ్చిన సరుకు కనుక అయిపోతే ఇతర రాష్ట్రాలలోని వారి తరుపువారికి సమాచారం అందిస్తారు. దీనితో మరలా వారు స్టాకును తెప్పించుకుంటున్నారు. సాక్సులు, మంకి టోపీలు, కోట్లు, చలి బనియన్లు, స్వెటర్లు, షాలువాలు, రగ్గులు, మఫ్లర్లు వంటివి వివిధ రకాలు లభిస్తున్నాయి. ఇవి 15 రూపాయల నుంచి 575 రూపాయల వరకూ ధర పలుకుతున్నాయి. వీరి షాపుల వద్దకు పెద్ద సంఖ్యలో వినియోగదారులు రావడంతో ట్రాఫిక్ స్థంభించి పోతుంది. దీనితో గత సంవత్సరం కల్యాణ చక్రవర్తి థియేటర్ వద్దకు దీన్ని మార్చారు. కాని ఈ సంవత్సరం రామా టాకీసు ఫుట్‌పాత్ వద్దనే షాపులను నిర్వహించుకునేందుకు అనుమతి లభించింది. దీనితో వారు ఈ సంవత్సరం ఇక్కడే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా తాము వ్యాపారాన్ని ఇక్కడ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నామని, లాభాలు బాగానే వస్తున్నాయని వారు అంటున్నారు.

మామూళ్ళ బెడద

ఎక్కడ నుండో ఇక్కడకి వచ్చి వ్యాపారం చేసుకుని పొట్ట పోసుకునే వీరికి మరో సమస్య వచ్చిపడింది. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని కొందరు ట్రాఫిక్ పోలీసులకు మామూళ్ళు ఇవ్వాల్సి వస్తోందని వ్యాపారులు అంటున్నారు.

-ప్రజాశక్తి విలేకరి

బెంజిసర్కిల్, విజయవాడ



సిద్ధంగా ఉన్నారో అంతవరకు బేరమాడతారు. నాణ్యత, ధర వంటి వాటి విషయంలో అవగాహన లేకుండా కొనడానికి ప్రయత్నం చేస్తే నష్టపోకతప్పదు. స్వెట్టరు కొనడానికి పోవడానికి ముందు స్వెట్టరు నాణ్యత, ధర గురించి తెలుసుకోవడం చాలా మంచిది.

స్వెట్టరును పట్టుకొని సాగదీసి వదిలిచూస్తే యథాస్థితికి వచ్చిన స్వెట్టరు మంచి నాణ్యతకు చెందినది. అలాగే స్వెట్టరును ఎత్తిపట్టి చూస్తే జల్లెడలా కాక చిక్కగానూ, మందంగానూ ఉండేవాటిని ఎన్నుకోవాలి. పలుచగా, జల్లెడలా ఉండే జాలీలు కేవలం అలంకారంగా, ఫ్యాషన్‌గా మాత్రమే పనికొస్తాయి. ఒరిజనల్ ఊలు స్వెట్టర్ల నాణ్యత గురించి చెప్పనే అక్కర్లేదు. కాకపోతే దాని రేటు మనం భరించగలమో లేదో ఎవరికి వారు నిర్ణయించుకోగలిగేదే.

వారివెన్నెన్ని ఇక్కట్లో...

నేపాల్ నుండి వచ్చి ఊరు కాని ఊరు, భాష కాని భాష, పరిచయం లేని సంస్కృతిలో వ్యాపారం చేయడం వారికి కత్తి మీద సామే. ఇదే వృత్తిగా ఉన్న నేపాలీలు కన్నవారిని, కట్టుకున్న వారిని, అయిన వారిని వదిలి నెలల తరబడి రోడ్డుపక్క గుడారాల్లో నివసిస్తున్నారు. ఊర్లలో తిరిగి అమ్మేవారైతే ఊరిలో ఉండే పాఠశాలలు, చెట్లు వంటి వాటి కింద బసనేర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. హైదరాబాద్ మహానగరంలో కోఠీ, చాదర్‌ఘాట్, అఫ్జల్‌గంజ్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో రోడ్డు పక్కనే ఏర్పాటుచేసుకున్న గుడారాల్లో ఒకవైపు వ్యాపారం చేస్తూ, మరోవైపున వంట, వార్పూ, బస చేయడంలో వారు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. కొందరు జంటలుగా వస్తే, మరికొందరు కుటుంబంలోని తల్లి, తండ్రి, సోదరులు వంటి వారితో ఇక్కడ నివాసముంటున్నారు. చిన్న పిల్లలున్న వారు రావడానికి ఎక్కువగా ఇష్టపడరు. ఎంతో కొంత సంపాదించి తమ మీద ఆధారపడిన వారికి పట్టెడన్నం పెట్టి కడుపు నింపాలనే పట్టుదల ముందు అవేవీ కష్టం కలిగించడం లేదని వారు ధీమాగా చెప్తున్నారు. భాష విషయంలో ఇబ్బందులుంటున్నాయని, అయితే హైదరాబాద్‌లో ఇంగ్లీషు, హిందీ అంకెలు మాట్లాడగలిగేవారే ఎక్కువగా ఉండటం వల్ల తేడాలు రావడం లేదని వారు చెప్తున్నారు. స్థానికంగా గూండా మామూళ్ల బెడద లేకున్నా ట్రాఫిక్ పోలీసులకు ఎంతోకొంత ముట్టచెప్పక తప్పడం లేదని వారు బాధపడటం మచ్చే కదా! ★

జడలో మసాలా వడ

చెమికల రాజశేఖర రెడ్డి

'జడలో మసాలా వడ'... పదే పదే అవే పదాలు నా మదిలో మెదులుతున్నాయి. ఏమిటీ జడలో మసాలా వడ అనుకుంటున్నారా! దీని వెనక వున్న కథ చెబితే మీకు డోకయినా రావొచ్చు. లేదా నవ్వయినా రావొచ్చు. ఈ రెంటిలో ఏదో ఒకటి గ్యారంటీ. నవ్వొస్తే సంతోషమే కానీ డోకొస్తే మాత్రం నేను కానీ, ఈ కథను ప్రచురించే ఎడిటర్‌గానీ బాధ్యులు కారు... ముందే చెబుతున్నాము. ఆ తర్వాత 'మా అనారోగ్యానికి కారణమయ్యారంటూ కోర్టుకెళతామంటే కుదరదు.

నిన్న ఉదయం ఎస్. ఎస్. ప్రొడక్షన్స్ ఆఫీసునుంచి "రమణస్వామీ! ఈ రోజు ఆఫీసు దగ్గరకు రా! పెద్ద సారు కథ వినాలనుకుంటున్నాడు..." అని ఫోనొచ్చింది. ఇక కష్టాలు తీరినట్టే అనుకొని ఆఘమేఘాలమీద జూబ్లీహిల్స్‌లోని ఎస్. ఎస్. ప్రొడక్షన్స్ ఆఫీసు దగ్గరకు పరిగెత్తాను. నాలుగైదు కథలున్నాయి నా దగ్గర. నిర్మాత, పెద్దసారు అంటే హీరో శరత్, సంభాషణల రచయిత చంటి, దర్శకుడు సూదిలోదారం సుబ్బారావు (సూదిలో దారం సినిమా హిట్టుకావడంతో అదే ఆయన ఇంటిపేరయిందని ప్రత్యేకంగా చెప్పాలా!) నాకోసం ఎదురు చూస్తూ వున్నారు.

నా బ్యాగులో వున్న ఫైలు తీసి వారి ముందు కూర్చున్నాను. కాఫీలు, బజ్జీలు, పకోడీలు, చిప్స్ సరఫరా అవుతున్నాయి. ఒక గంటలోపే మూడు కథలూ చెప్పాను. హీరో "ఇవేం కథలయ్యా బాబూ, నా స్టేచర్‌కు తగినట్టుగా లేవు... అసలే సినిమా ఇండస్ట్రీ పైరసీ బారిన పడి నానా ఇబ్బందులు పడుతోంది. దానికితోడు కథాబలం లేని సినిమాల్ని నిర్మిస్తే ఇక నిర్మాతలు చిప్ప చేతపట్టుకోవాల్సిందే. నీవు చెప్పిన కథల్లో ప్రతి కథలోనూ కొన్ని అంశాలు మాత్రమే బాగున్నాయి... మొన్న ఆస్ట్రేలియాకు షూటింగ్‌కి వెళ్ళినప్పుడు యాభై హాలీవుడ్, యూరోపియన్ సినిమాల డీవీడీలు తెచ్చాను. వాటిలోనుంచి ప్రస్తుతానికి నాలుగు సెలెక్టు చేశాను. వాటిని ఆధారం చేసుకొని ఒక కథ తయారు చేయి. రేపు మరలా ఒక సిట్టింగ్ వేద్దాం... రేపే కథ ఫైనలైజ్ చేద్దాం. ఓకేనా... ఇదో నిర్మాతగారూ మీరు ఓ పదివేలు ఈ స్టోరీ రైటర్‌కు రేపు అందించే ఏర్పాటు చెయ్యి. ఇక నే వెళతాను" అంటూ నల్లకళ్ళద్దాలు ధరించి స్టయిల్‌గా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఎందుకో హీరోగారు చాలా తొందరపడుతున్నారు? కాస్త నింపాదిగా కథ గురించి అనుకుంటే ఫైనల్ ప్రొడక్టు బాగా వస్తుందిగదా!" అన్నాను నేను.

ఆ మాటకు నిర్మాత కాస్త కర్కశంగా "మీకు ఇండస్ట్రీ గురించి సరిగా తెలిసినట్టు లేదు. ఈయనకు గట్టిగా పోటీ ఇస్తున్న హీరో సుందరం తాజా సినిమా ఆవతల హిట్టయి, ఆయన అభిమానులు వీరంగం చేస్తున్నారు. ఈయనకు అభిమానుల్నించి ఒత్తిడి బాగా ఎక్కువయింది. ఆ ఒత్తిడి తట్టుకోలేక ఆయన

సతమతమవుతుంటే మధ్యలో నీ బోడి సలహాలు... ఆయన విన్నాడంటే కాల్చేసినా కాల్చేయగలడు..." అంటూ విసుక్కున్నాడు.

కథలు రిజెక్టయ్యాయనే బాధ లోపల వున్నప్పటికీ, నిర్మాత విసుక్కున్నప్పటికీ పదివేలు అడ్వాన్స్‌గా ఇవ్వమని నిర్మాతకు హీరోగారు చెప్పడం కాస్త సంతృప్తిగా అనిపించింది.

అక్కడినుంచి ఇంటికొచ్చి ఆ డీవీడీల్ని చాలా తీక్షణంగా చూశాను. ఇదో రకం పైరసీ అయినప్పటికీ వాటినాధారంగా ఓ కథ తయారు చేశాను. మరుసటి రోజు పొద్దున్నే ఎస్. ఎస్. ప్రొడక్షన్ ఆఫీసు దగ్గరకు వెళ్ళాను. పైరసీకి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించేందుకు నిర్మాత, హీరో తదితరులు సెక్రటేరియట్‌కు వెళ్ళారని తెలిసింది. వాళ్ళకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. కథ సారాంశం వున్నపేపర్లను మరోసారి చదువుకున్నాను. కొద్దిసేపటికి హీరో, నిర్మాత, కెమెరామెన్, డైరెక్టర్, ఆయన తోక ... కోడైరెక్టర్, హీరో అభిమానించే పాటల రచయిత విరిజాజుల సోమేశ్వరం, ఇండస్ట్రీ గ్లామర్‌కు ఆకర్షితుడైన ఫైనాన్షియర్, ప్రముఖ బిల్డర్ భవనమూర్తి ఆఫీసులోకి అడుగు పెట్టారు. అందరికీ నమస్కారం చేసి వారితోపాటు లోపలికెళ్ళాను.

కొద్దిసేపు హీరో పైరసీకి వ్యతిరేకంగా ఉపన్యాసం చేశాడు. పైరసీ చేస్తున్న వాళ్ళని నిలువునా

చీరేయాలి... సినిమా విడుదలయినా కాకముందే దొంగ వీసీడీలు తయారు చేసి ప్రతి ఇంటిని ఒక థియేటర్‌ను చేస్తున్నారు. ఈ ప్రజలకూ బుద్ధి లేదు. పదిరూపాయలతో దొంగ వీసీడీలు తెచ్చుకుని ఇంట్లోనివారందరూ చూసేయడమే... ఛ... ఛ చాలా తలనొప్పిగా తయారయిందయ్యా వ్యవహారం...వరదలొచ్చినా, భూకంపాలొచ్చినా మరలా మన వెంట పడతారు. మనకు అంతగా రాకపోయినా క్రికెట్టో, హాకీనో ఆడి డబ్బు వసూలు చేసి మరలా సహాయనిధి అందించాలి... ఏం ప్రజలో ఏమో..." అంటూ కోపంగా తిట్లకు లంకించుకున్నాడు.

ఇంతలో '24 గంటలు' ఛానెల్‌వారు హడావిడిగా లోపలికి ప్రవేశించి పైరసీకి వ్యతిరేకంగా హీరో అభిప్రాయాన్ని రికార్డు చేశారు. ఆ కార్యక్రమమమంతా పూర్తయిన తర్వాత హీరోచుట్టూ వున్న వారందరూ ఆయన అభిప్రాయం భేషంటూ ఆయన్ని అభినందనలతో ముంచెత్తారు. నేను కూడా అందరితోపాటు ఆయనకు షేక్ హాండిచ్చాను.

"ఏవయ్యా రమణస్వామీ రాత్రి ఆ డీవీడీలు చూశావా? కథ ఒక కొలిక్కి వచ్చిందా?..." హీరో అడిగాడు.

కడుపులో ఎక్కడో గెలికినట్టనిపించింది. నిన్నటి నుంచి హీరోగారు పైరసీకి వ్యతిరేకంగా అగ్గిమీద గుగ్గిలం అవుతున్న తీరును ఒక పక్క గమనిస్తూనే వున్నాను. మరోపక్క హాలీవుడ్ డీవీడీలు చూసి వాళ్ళ పర్మిషన్ లేకుండా ఒక కథ తయారు చేయమన్నాడు. ఇది కూడా ఒక రకంగా దొంగతనమే కదా...

"ఆ చూశాను సార్... బ్రహ్మాండమైన కథ తయారు చేశాను. మన నేటివిటీకి అనుగుణంగా మార్చాను. ఈ సారి మీకు హిట్ గ్యారంటీ"

"అలా వుండాలి స్పిరిట్ అంటే... ఏదీ ఇక మొదలెట్టు. అందరూ ఇక్కడే వున్నారు. వీళ్ళందరూ నమ్మకస్తులే లే... మన కథ లీక్కాదులే" అన్నాడు హీరో.

అప్పుడే మన కథంట! ఎవరి కథ ఇది? ఎవడో హాలీవుడ్ రచయత బుర్రలో మెదిలిన కథ. ఈ కథను ఇక్కడవాళ్ళెవరన్నా విని బయట లీక్ చేస్తారనే భయం మరో పక్క. ఏంటో ఎందుకు బతుకుతున్నామో ఏంటో...' మనసులోనే అనుకున్నాను.

మొత్తం కథంతా విని కొన్ని కొన్ని చిన్న మార్పులతో ఈ హాలీవుడ్ కథను తెలుగు సినిమాగా తీయడానికి అందరూ అంగీకరించారు. రేపే ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టమని హీరో నిర్మాతకు ఆదేశాలిచ్చాడు. ఆయన మొఖంలోని వెలుగు ముందు సూర్యుని వెలుగు దిగదుడుపేననిపించింది. ఇక ఈ సినిమాకు ఏ పేరు పెట్టాలనే విషయంపై చర్చ మొదలైంది. ఈ లోపే పదివేల రూపాయల చెక్ ఒకటి నా జేబులో పెట్టారు. దాన్ని జాగ్రత్తగా తడుముకున్నాను.

"హీరో హీరోయిన్ అభిమానాన్ని పొందడానికి ఈ సినిమాలో ఒక వైవిధ్యమైన సీన్ పెట్టుకుందాం" హీరో అన్నాడు.

అందరూ ఏమిటా సీన్ అన్నట్టు ఆయన వైపు చూశారు.

"రోడ్డుపక్కన హీరోయిన్ ఒక తోపుడు బండి పెట్టుకుని దోసెలు, ఇడ్లీలు, వడలు తయారు చేసి అమ్ముతుంటుంది. ఒక రోజు హీరో అక్కడకొచ్చి టిఫిన్ తింటూ వుంటాడు."

"కానీ సార్... హీరోది ఫైవ్‌స్టార్ హోటల్లో తినే లెవెల్." నసిగాను.

"కథ చెప్పేంతవరకే నీ పని... అనవసరంగా మాట్లాడకు రైటరూ..." పైకి నవ్వుతూ లోపల పళ్ళు కొరుకుతూ హీరో బదులిచ్చాడు.

"హీరోది మొదటినుంచి ఎప్పుడెలా ప్రవర్తిస్తాడో ఏం చేస్తాడో అంతు చిక్కకుండా ఎదుటివారిని ఎప్పుడూ చిక్కుల్లో పెట్టే మనస్తత్వం... కోట్లాది రూపాయలకు వారసుడైనప్పటికీ రోడ్డు పక్కన అమ్మే ఇడ్లీల్ని తింటాడు. నలభైలక్షల రూపాయల విలువ చేసే కారులోంచి లక్ష రూపాయలు విలువ చేసే సూటు ధరించిన హీరో బయటకొచ్చి రిక్షావాళ్ళ పక్కన, కూలీల పక్కన, దరిద్రుల పక్కన నిలబడుకొని ఇడ్లీలు, వడలూ తినడం వెరైటీగా లేదూ... ఇలాంటి పనుల్ని నా పాత్ర చాలా చేస్తుంది... ఇలా వుంటేనే మాస్‌కు ఎక్కేది. ఒక రోజు హీరో.... అలాగే రోడ్డు పక్కన నిలబడుకొని ఇడ్లీలు, వడలు తింటూ వుంటాడు. ఇంతలో కొంతమంది రౌడీలు టిఫిన్ తింటూ హీరోయిన్‌ను ఏడిపించి ఆమెకు డబ్బులు ఇవ్వకుండా వెళ్ళబోతుంటారు. ఇదంతా గమనిస్తున్న హీరో వాళ్ళమీదకు ఉరుకుతాడు... ఈ గొడవలో హీరో ప్లేటులోని వడ ఎగిరి వెళ్ళి హీరోయిన్ జడలో ఇరుక్కుంటుంది. రౌడీల్ని చిత్తుచేసి హీరోయిన్ మనసులో స్థానం ఏర్పరుచుకున్న హీరో దుమ్ముదులుపుకొని ఆమె జడలో ఇరుక్కున్న వడను బైటికి తీసి దాన్ని నోట్లో వేసుకుని నములుతాడు..."

ఆయనలా చెప్పగానే జడలో వడ కళ్ళముందు సాక్షాత్కరించి నా మనసులో వికారం మొదలయింది. హీరో చుట్టుపక్కల వున్నవాళ్ళందరూ హీరో హీరోయిన్ల కలయికను "అద్భుతం అద్భుతం" అని పొగడడం మొదలుపెట్టారు.

"ఆ వడను తీసుకొనే సమయంలో ఆమె వంపుసొంపుల్ని, అందాన్ని చాలా దగ్గరగా హీరో గమనిస్తాడు... దాంతో హీరోలో ఒక గొప్ప కదలిక మొదలవుతుంది. ప్రేమ పొంగుకొస్తుంది. హీరోయిన్ కట్టుకున్న వస్త్రాలు పాతవే కావొచ్చు... వాటికి చిరుగులుండొచ్చు... కానీ హీరో ఇక ఆమే తన జీవిత భాగస్వామి అనుకుంటాడు. వెంటనే హిమాలయాల్లో పాట మొదలవుతుంది."

హీరో పాట అనగానే అంతవరకూ ఈ సినిమాలో పాటలెన్ని వుంటాయో, తనకెంత గిట్టుబాటవుతుందోనని లోలోపల మధనపడుతూ వున్న విరిజాజుల సోమేశ్వర్ సడన్‌గా అలర్టయి హీరో వైపు కృతజ్ఞతగా చూశాడు.

వెంటనే హీరో "సోమేశ్వరంగారూ ఏదైనా పల్లవి అందుకోవాలనిపిస్తే అందుకోండి... రెండు రోజుల్లో పాటలన్నీ రెడీగావాలి." అన్నాడు. ఆయన వెంటనే బల్లమీద దరువేస్తూ పాట అందుకున్నాడు

పాట పల్లవి

అతను: జడ జడ, గుండెల్లో దడ దడ
ఆమె: వడ వడ వాయించే ఎడాపెడ
అ: నీ జడ, నా వడ
ఆ: ఇక చూసుకోరా సోగ్గాడ
అ: అద్దాల పావడ,
ఆ: ఆడుకో సందెకాడ

చరణం:

అతను: శివుని తలపై గంగలా,
ఆమె: నా జడలో నీ వడ
అ: ఆకసాన చంద్రుడిలా
ఆ: నా జడలో నీ వడ
అ: మధనుడి చేతి బాణంలా
ఆ: నా జడలో నీ వడ
అ: మైఖేల్ జాక్సన్ గానంలా
ఆ: నా జడలో నీ వడ
అ: హిమాలయాల్లో ఎవరెస్టులా ఘనమైనది ఈ జడ వడ, జడ వడ, జడ వడ ప్రేమ. ॥జడ॥

పాటల రచయిత స్పీడుకు అక్కడున్నవారందరూ అదిరిపోయారు. నిర్మాత, హీరోలతో సహా ఆయన్ని సరస్వతీ పుత్రునిగా అభివర్ణించారు.

"సినిమా పేరు చెప్పనే లేదు... ఏం రైటరూ నీవేమన్నా ఏదైనా పేరు అనుకున్నావా... నాలుగైదు పేర్లు చెప్పు" నిర్మాత హుషారుగా అడిగాడు.

నేనేదో చెప్పబోయేలోపలే హీరోగారు " 'జడలో మసాలా వడ' అనే పేరు బాగుంటుంది... దాన్నే ఫైనలైజ్ చేయండి" అన్నాడు.

చుట్టుపక్కల వున్న వాళ్ళందరూ నిర్మాతతో సహా గట్టిగా అరిచి గెంతులేసారు. "మీ ఐడియాలు అమోఘం... అందుకే సార్ మీకంత ఫ్యాన్ ఫాలోయింగ్..." అంటూ అందరూ షేక్ హాండిచ్చారు. నేను కూడా షేక్‌హాండిచ్చి జేబులోని చెక్‌ను మరోసారి తడుముకున్నాను.

బయటపడి బ్యాంక్‌వైపు పరిగెత్తి డబ్బు డ్రా చేసుకుని, దారిలో కడుపునిండా తిండి తిని నిద్రకుపక్రమించాను. రాత్రి నిద్రలేదు. అందుకే వెంటనే నిద్రాదేవి కౌగిలించుకుంది. దానికితోడు మరో రెండు నెలలపాటు తిండికి ఇబ్బంది లేకపోవడమనే ఆలోచనతో మనసంతా గమ్మత్తుగా వుంది. జేబు భారం పెరిగేకొద్దీ మనసు భారం తగ్గుతుందని ఎవరో అన్న మాటలు గుర్తు చేసుకుంటూ నిద్రపోయాను.

"ప్రముఖ రచయిత రమణస్వామి అందించిన కథ గొప్పగా వుండడంతో 'జడలో మసాలా వడ' సినిమా హిట్టయ్యింది. ఆ తర్వాత ఆయన "బొడ్డులో ఇడ్లీలు", "నెత్తిపై కొవ్వొత్తులు", "పెదవులపై పెసరట్టు..." తదితర సినిమాలకు కథ అందించి నేడు అగ్రస్థాయి సినిమా కథా రచయితగా ఎదిగారు. ఇక ముందు ఆయన వైవిధ్యమైన కథల్ని అందించి సినిమా పరిశ్రమ మరిన్ని విజయాలవైపు పయనింప చేయాలని కోరుకుంటున్నాము..." స్టేజిపై వక్తలు ఒకరొకరే నా సన్మాన సభలో పొగుడుతుంటే ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేస్తున్నట్టు తెల్లవారుఝామున కలవచ్చింది. ఈ కలలు నిజమైతాయని అంటారు. ప్చ్ పాపం తెలుగు సినిమా ప్రేక్షకులు!!!

✤

బాపూ బొమ్మలు కరువైపోతున్నాయా... ?

అంపశయ్య నవీన్

"షాపింగ్ చేసొస్తున్నట్టున్నారు?"

"అవునండీ... పండగల సీజన్‌కదా.."

"యేం వేం కొన్నారేమిటి?"

"పిల్లలకి డ్రెస్సులు కొన్నాం.."

"ఆడపిల్లలకా? మొగపిల్లలకా?"

"గమ్మత్తేమిటంటే... మాకందరూ ఆడపిల్లలే.. నాకిద్దరు కూతుళ్ళు... వాళ్ళిద్దరికీ చెరో ఇద్దరు పాపలు..."

"కంటే కూతుర్నే కనాలన్న సూత్రాన్ని ఆచరిస్తున్నారన్నమాట... ఆడపిల్లల్ని పిండదశలోనే చంపేస్తున్న ఈ రోజుల్లో మీ ఇంట్లో ఇంతమంది ఆడపిల్లలున్నారంటే మిమ్మల్ని అభినందించాలి".

" ఆడపిల్లలంటేనే నాకు చాలా ఇష్టమండీ!
అలా అని మొగపిల్లలంటే ద్వేషమనికాదు..."

"ఇంతకూ ఏమేం డ్రెస్సులు కొన్నారు?"

"అన్నీ ప్యాంట్‌లు, షర్ట్‌లు, జీన్స్‌లే..."

"ఆడపిల్లలక్కూడా ప్యాంట్స్, షర్ట్సేనా?"

"ఈ రోజుల్లో ఆడపిల్లల డ్రెస్సులకూ, మగపిల్లల డ్రెస్సులకూ తేడా లేకుండా పోతున్నదండీ..."

" అవును.. లంగా వోణీ వేసుకొని, రెండు జడలు వేసుకొని, పూలు పెట్టుకొని కాలేజీలకెళ్ళే అమ్మాయిలు ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు.. అలాంటి అమ్మాయిలను చూడాలని నేనెంత ముచ్చటపడ్తున్నానో"

" మీకా అవకాశం లేదు లెండి.. ఎందుకంటే లంగావోణీలు వేసుకోవడం ఇప్పటి అమ్మాయిలకు చాలా ఎబ్బెట్టుగా, పాతకాలపు పద్ధతిగా కనిపిస్తున్నది. లంగావోణీలు పోయి కొంతకాలం పంజాబీ డ్రెస్సులొచ్చాయి. ఇప్పుడు పంజాబీ డ్రెస్సులు కూడా పోయాయి. ఇప్పుడు ఆడపిల్లలందరూ దర్జాగా ప్యాంట్, షర్ట్స్ వేసుకుంటున్నారు "

" చాలా ఆశ్చర్యం!"

" మరో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నగరంలో చీరలు కట్టుకునే ఆడవాళ్ళ సంఖ్య కూడా క్రమంగా తగ్గుతున్నది... ఇంట్లో ఉన్నప్పుడు నైటీలు వేసుకుంటున్నారు. బయటకు వేళ్తే పంజాబీ డ్రెస్సో, ప్యాంట్, షర్టులో వేసుకుంటున్నారు..."

" లంగావోణీలు వేసుకున్న అమ్మాయిలు ఎంత చూడముచ్చటగా ఉంటారో! లంగావోణీ వేసుకోని బాపూ బొమ్మల్ని మనం ఊహించుకోగలమా... ఎవరైనా అందమైన ఆడపిల్లల్ని చూస్తే బాపూ బొమ్మలా ఉందనుకునే వాళ్ళం.. ఇప్పుడా బాపూ బొమ్మల్లాంటి అమ్మాయిలు ఎంత కరువైపోయారో... "వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు నా అక్షరాలు " అని పూర్వం బాలగంగాధరతిలక్ అన్నాడు. ప్యాంట్స్, షర్ట్స్ వేసుకొని తిరుగుతున్న ఇవ్వాల్టి ఆడపిల్లల్ని చూస్తే తిలక్ తన అక్షరాల్ని ఆడపిల్లల్తో పోల్చుకునే వాడేనా".

"డెఫినిట్‌గా పోల్చుకునేవాడు కాడు.. ఒకప్పుడు స్త్రీలు తమ వక్షస్థలాలను నిండుగా కప్పుకోకుండా కనిపించేవాళ్ళుకాదు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. వోణీలూ పోయాయి. దుపట్టాలు పోయాయి. చీరెకొంగులూ పోయాయి. ఇవ్వాల్టి సినిమాలను చూడండి.. అంగాంగాలను నిస్సిగ్గుగా ప్రదర్శించటమే నేటి సినిమాస్టార్లకు సర్వసాధారణమైపోయింది. ఒకప్పుడు దుష్ట పాత్రలు వేసే స్త్రీ పాత్రలు వేసుకునే డ్రెస్సుల కంటే అధ్వానమైన డ్రెస్సుల్ని ఇవ్వాల్టి సినిమా కథానాయికలు వేసుకుంటున్నారు. ఏ సావిత్రినో, ఏ భానుమతినో, ఏ అంజలీదేవినో, ఏ జముననో ఈనాటి హీరోయిన్లు వేసుకునే డ్రెస్సుల్లో ఊహించుకోగలమా?"

" అస్సలు ఊహించుకోలేం... మరో బాధాకరమైన దృశ్యమేమిటంటే స్కూళ్ళకూ, కాలేజీలకూ వెళ్తున్న ఆడపిల్లలెవరూ జడలు వేసుకోవడం లేదు.. మొగపిల్లల్లాగే క్రాపులతో వెళ్తున్నారు."

"అయ్యా! తమ కూతుళ్ళకు జడలు వేసేంత టైమ్ ఇవ్వాల్టి తల్లులకెక్కడుందీ? ఇవ్వాళ చాలా కుటుంబాల్లో భార్యా భర్తలిద్దరూ ఉద్యోగాలు చేసేవాళ్ళే- వాళ్ళు త్వరగా పిల్లల్ని స్కూళ్ళకు పంపించి వాళ్ళూ ఆఫీసులకు వెళ్ళిపోవాలి. తలలు దువ్వి జడలు వేసేంత టైమ్ ఉండటం లేదు. అందుకని శుభ్రంగా ఆడపిల్లల్ని కూడా నెలకొకసారి హెయిర్ కట్టింగ్ సెలూన్స్‌కు తీసికెళ్ళి క్షౌరం చేయిస్తున్నారు. జడలు వేసుకునే అమ్మాయిల్ని మనం ఇకనుండి ఏ ఎగ్జిబిషన్‌లోనో చూడాల్సిందే..."

" మారుతున్న కాలంతో బాటు కొన్ని మార్పులు తప్పనిసరిగా వస్తాయనుకోండి... ఇవ్వాళ ఆడపిల్లలు విరివిగా మోటారుబైక్స్‌ని నడుపుతున్నారు. కార్లు నడుపుతున్నారు. బస్సుల్లో, ట్రెయిన్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ పనులు చెయ్యడానికి అనుకూలంగా ఉండే డ్రెస్సుల్నే వాళ్ళు ధరించవలసి ఉంటుంది. పాంట్, షర్టులే అందుకు అనుకూలంగా ఉంటాయేమో.. ఆడవాళ్ళ డ్రెస్సుల్లో ఇంత విప్లవాత్మకమైన మార్పులు రావడానికి బహుశా ఇదే కారణమేమో..."

" కొంతవరకు అదే కారణం కావచ్చు. కానీ శరీరమంతా కనిపించేలా డ్రెస్సులు వేసుకోవడం మాత్రం కేవలం ఈనాటి సినిమాల ప్రభావం వల్లనే అని నా అభిప్రాయం... సెక్సీగా కన్పించడం నేటి ఫ్యాషన్ అయిపోయింది".

"సమాజాన్ని సినిమాలు అనుకరిస్తున్నాయా? లేక సినిమాల్ని సమాజం అనుకరిస్తున్నదా తెలియడం లేదు!"

కుళ్లు బుద్ధి

మాదుగుందు కృష్ణ

రామయ్య, సోమయ్య అన్నదమ్ములు. రామయ్య వయసులో పెద్దవాడు. అతని స్వభావం అంత మంచిదికాదు. సోమయ్య చిన్నవాడు. మంచి మనసున్నవాడు. అన్న అంటే చాలా అభిమానం. రామయ్యకు మాత్రం తమ్ముడంటే గిట్టదు. ఇద్దరూ పెరిగి పెద్దవారయ్యారు.

తండ్రి చనిపోయాక ఆస్తి మొత్తాన్నీ రామయ్య స్వాధీనం చేసుకున్నాడు. బాగా పండే పొలాన్ని తను తీసుకొని, తమ్ముడికి బంజరు భూమి ఇచ్చాడు. తాతలనాటి ఇల్లు తను అట్టిపెట్టుకొని, పూరి గుడిసెను తమ్ముడికిచ్చాడు. అయినా సోమయ్య అన్నను ఏమీ అనలేదు.

రామయ్య ధనవంతుడి కూతుర్ని వివాహం చేసుకున్నాడు. దుష్ట స్వభావంలో ఆమె అతనికి ఏ మాత్రం తీసిపోదు. పైగా పొగరుబోతు. మూర్ఖురాలు. సోమయ్య పేదింటి యువతిని పెళ్లాడాడు. ఆమె చాలా మంచిది. భర్తకు అన్ని విధాలా సహకరిస్తుంది. అన్నదమ్ములిద్దరూ పొలం బాగు చేసి విత్తనాలు చల్లారు. సోమయ్య పొలం ఏదో లేదనకుండా పండింది. రామయ్య పొలం బ్రహ్మాండంగా పండింది. అయినప్పటికీ తమ్ముడి పంట కాజేయాలనుకున్నాడు. రాత్రికి రాత్రే పొలంలో వున్న పంటనంతటినీ తన ఇంటికి తరలించుకున్నాడు.

మర్నాడు పొలం వెళ్లిన సోమయ్య విస్తుపోయాడు. అన్న దగ్గరకెళ్లి విషయం చెప్పాడు. "నాకేం తెలుసు? నీ సంగతి నాకేం చెప్పకు. నీ సంసారం నీ ఇష్టం" అంటూ తనకేం పట్టనట్లు మాట్లాడాడు అన్న.

"బావగారూ! ఇంట్లో తిండి గింజలు కూడా లేవు. కనీసం అంతవరకైనా ఇవ్వమని అక్కతో చెప్పండి" దీనంగా అడిగింది సోమయ్య భార్య.

"భలేదానివమ్మా! మాకు మాత్రం ఎక్కణ్ణుంచి వస్తాయి? మీకిచ్చి మేమేం తినాలి గడ్డి? మమ్మల్నేమీ అడక్కండి. మీ దారేదో మీరు చూస్కోండి" కసురుకుంది రామయ్య భార్య. తమ దీనావస్థకు బాధపడుతూ దంపతులిద్దరూ ఇంటిదారి పట్టారు.

ఆ రాత్రి వాళ్ల ఊళ్లో భూకంపం వచ్చింది. ఇళ్ల ప్రాంతాల్లో దాని ప్రభావం లేకపోయినా పొలాల్లో గొప్ప మార్పు వచ్చింది. సోమయ్య చేలో బండరాళ్లు తేలాయి. రామయ్య పొలం మాత్రం చదునుగానే వుంది. పొలాన్ని చూసి సోమయ్య దుఃఖించాడు. భార్య బాధపడింది. ఆ పొలాన్నే బాగు చేసుకొని, సాగు చేయాలని నిశ్చయించుకున్నారు.

భార్య సహాయంతో రాళ్లను గునపంతో కదిలిస్తున్నాడు సోమయ్య. ఆ పని ఎంతో కష్టంగా వుంది. చెమట కారుతోంది. భార్య రాళ్లు మోసీ మోసీ అలసిపోయింది. సోమయ్యకూ విసుగొచ్చింది. చికాగ్గా రాయిని గునపంతో ఒక్క పోటు పొడిచాడు. అంతే... రాయి లేచి పక్కన పడింది. ఆ స్థానంలో ధగధగలాడుతున్న బంగారు ముద్దలు కనిపించాయి. ఎంతో సంబరపడిపోయారు ఆ దంపతులు. ఆ బంగారం అమ్మి ఇల్లు, పొలం కొనుక్కున్నారు. పొలంలో కష్టపడి పని చేస్తూ సుఖంగా జీవించసాగారు.

రామయ్య పొలం చదునుగా వున్నప్పటికీ పంటకు పనికిరాకుండా పోయింది. తమ్ముణ్ణి వేధించాలని అనుకున్నందుకు తమకు తగిన శిక్షే పడిందని పశ్చాత్తాపపడ్డారు రామయ్య, అతని భార్య.



బాలనేస్తాలు

రంగులు అద్దుదామా!

నేస్తాలూ! బుడ్డోడు భలే వేషం కట్టాడుకదూ. కుందేలు మాస్కు, కుందేలు బూట్లు... ఓహ్! అదిరింది. మీరుగాని దీనికి రంగులు అద్దితే ఇంకా అదురుద్ది.

వి'చిత్రం'

చిన్నారులూ! వి'చిత్రం'లో ఎంతమంది పిల్లలున్నారో చెప్పకోండి? మేం ముందే చెప్పేస్తున్నాం. మీరు బాగా పరిశీలనగా చూశాక, ఆలోచించుకున్నాక సమాధానం చెప్పండి. మళ్లీ మేం జవాబు చెప్పాక 'వేళ్లు విదుల్చుకుంటూ... ఉష్... అరే...స్సే' అని ఎంతగా అనుకున్నా లాభంలేదు. మరి సమాధానం ఏంటి? ముగ్గురు ముద్దులొలికే బాబులున్నారా! అయితే మా సమాధానం చూడండి.

జవాబు

నేస్తాలూ... ఇవాళ్టి వి'చిత్రం'లో ముగ్గురు పిల్లలు కాదు. ఏడుగురు వున్నారు. కావాలంటే... ఒక తల రెండు చేతులు, రెండు కాళ్లు కలుపుతూ చూడండి. మీకు ఏడుగురు పిల్లలు కనిపిస్తారు. అలా చూసేటప్పుడు రెండు చేతులతో మిగతా బొమ్మను మూసేయండి. మీకు ఇంకా స్పష్టంగా అర్థమౌతుంది. ఈ ప్రశ్నను మీ మిత్రులను కూడా అడగండి. మీ జవాబు విన్నాక వాళ్లు తెగ ఆశ్చర్యపోతారు.

చిన్నారి చిత్రకారులు

ఎస్.మనోజ్‌కుమార్, 9వ తరగతి, కె.వెంకటాపురం, కోటవురట్ల, విశాఖ.



కె.లక్ష్మణ, 8వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్, అలజంగి, బొబ్బిలి.

డి.అనూష, 2వ తరగతి, సెయింట్ ఆండ్రూస్ స్కూల్, సికింద్రాబాద్.





వీరి వీరి గుమ్మడిపండు...
వీరి పేరేమి?

హాలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో ఒక మామ్మగారు వచ్చారు. ఈమె గొప్ప సంగీత విద్వాంసురాలు. బొమ్మ చూడంగానే ఆమె ఎవరో మీకు తెలిసే వుంటుంది. మరి ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఇవాళే ... ఇప్పుడే కార్డుమీద రాసి పోస్టు చెయ్యండి. సరైన సమాధానమైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. సరేనా! మరి మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

గతవారపు జవాబు
హోచిమిన్

సరైన సమాధానం రాసినవారు

బి.పావని, 9వ తరగతి, అశోక్‌నగర్, హైదరాబాదు. పి.పాండురంగారావు, ఎ.వెంకటేశ్వరరావు, 10వ తరగతి, వంగర. కె.కాంచన, వి.రాజేష్, బి.పండు, ఎమ్.శోభ, 9వ తరగతి, పెదరావూరు. ఎ.వాసవి, యు.రాజేంద్ర, ఎల్.ఉమామహేశ్వరరావు, 4వ తరగతి, విజయవాడ. కె.తరుణ్, 10వ తరగతి, విజయనగరం. ఎమ్.వల్లభ్, 8వ తరగతి, చంద్రుగొండ, ఖమ్మం. యు. విశాఖ, 10వ తరగతి, నల్గొండ. వి.నాగమణి, 10వ తరగతి, కోదాడ. బి.విజయ, 7వ తరగతి, నక్కపల్లి, విశాఖ. సి. పార్వతి, 7వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్. ❄

మొత్తం జంతువులెన్ని?

ఒక రైతు తన దగ్గర బోలెడన్ని జంతువులు వున్నాయని డప్పాలు కొట్టుకోసాగాడు. ఇది విని విని విసుగెత్తిన ఓ వ్యక్తి 'నీ దగ్గర మొత్తం ఎన్ని జంతువులు వున్నాయేంటి?' అనడిగాడు.

దానికి ఆ రైతు 'నా దగ్గర రెండు మినహా అన్నీ గుర్రాలే వున్నాయి. రెండు మినహా అన్నీ గొర్రెలే వున్నాయి. రెండు మినహా అన్నీ పందులే వున్నాయి' అన్నాడు. ఈ సమాధానం విన్న ఆ వ్యక్తికి మతిపోయినంత పనైంది. ఆ రైతు దగ్గర ఎన్ని జంతువులు వున్నాయో మాత్రం అతనికి తెలీలేదు. మరి మీరు చెప్పగలరా?

జవాబు

రైతు దగ్గర మొత్తం మూడంటే మూడు జంతువులు వున్నాయి. అవేంటంటే... ఒక పంది, ఒక గుర్రం, ఒక గొర్రె.

ఏది పొడవైనది?



ఇక్కడ కొన్ని వస్తువులు వున్నాయి కదా. వీటన్నిటిలోను ఏది పొడవైనదో మీరు చెప్పాలి. ఏంటి ఇంతగా ఆలోచిస్తున్నారు? తెలీకపోతే జవాబు చూడండి.

జవాబు: **అన్నిటి పొడవూ ఒక్కటే. ఏంటి... నమ్మబుద్ధి కావడంలేదా? స్కేలుతో కొలిచి చూస్తే ఆ విషయం తెలిసిపోతుంది.**

యాపిల్ పెన్సిల్ హోల్డర్

హేయ్ పిడుగులూ! ఇవాళ మనం పేపర్‌తో యాపిల్ పెన్సిల్ హోల్డర్ చేయడం ఎలాగో చెప్పకుందాం. **ఏమేం కావాలంటే...** ఒక బూర, దినపత్రికలు, తెల్ల కాగితాలు, ఎరుపు, ఆకుపచ్చ స్కెచ్‌పెన్నులు, గమ్. **ఎలా చెయ్యాలంటే...** ముందు బూరను ఊదండి. తర్వాత గాలిని బయటకు వదిలేయండి. ఇప్పుడు మళ్లీ ఊది మూతి కట్టేయండి. ఇలా చేయడం వల్ల బూర మరింత గుండ్రంగా అవుతుంది. ఇప్పుడు ఈ బూర చుట్టూ కాగితాలను అతికించండి. ఇలా ఏడెనిమిది సార్లు అతికించండి. తర్వాత బాగా ఆరనివ్వండి. (దారం కట్టిన చోట మాత్రం కాగితం అతికించకండి. ఎందుకంటే మీరు పెన్సిళ్లు, పెన్నులు పెట్టుకోవాలంటే... ఒకచోట ఓపెన్‌గా వుండాలిగా. అందుకు.)

ఇప్పుడు పిన్నీసుతోగాని, గుండుసూదితోగాని బూరను గుచ్చండి. పగిలిన బూర ముక్కలను బయటకు తియ్యండి. మీ చేతిలో గుండ్రటి కాగితపు బంతి వుంటుందికదా. ఇది నేలమీద నిలబడలేదు. అందుకని అడుగున దీన్ని

కొద్దిగా ఒత్తండి. అప్పుడు నేలమీద చక్కగా నిలబడుతుంది. దీని చుట్టూ తెల్లటి కాగితాన్ని అతికించండి. దానికి ఎరుపు రంగు వెయ్యండి. తర్వాత తెల్లటి కాగితాన్ని రెండు మూడు మడతలువేసి ఆకు ఆకారంలో కత్తిరించి ఆకుపచ్చ రంగు వెయ్యండి. ఇలాంటి రెండు ఆకులను యాపిల్‌పైన అతికించండి. అంతే ... యాపిల్ పెన్సిల్ హోల్డర్ రెడీ. దీంట్లో ఎంచక్కా పెన్సిళ్లు, పెన్నులు పెట్టుకోవచ్చు ముచ్చటగా వుంటుంది. చేసేస్తారుగా.

సు'దూరదర్శిని'

ఆనందం ఇంత సంతోషంగా ఉంటుందా అన్న విషయాన్ని ప్రతిమాపురి మొదటిసారి తెలుసుకుంది. మనసులో ఏదో అలజడి, చెప్పలేని సంచలనం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఎక్కడో హృదయపు అట్టడుగు పొరల్లోంచి ఉబికివస్తున్న సంతోషం తెరలు తెరలుగా కమ్ముకుంటోంది.

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఢిల్లీకి దూరంగా ఉన్న క్వార్టర్సు...

ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండటంతో, వరుసగా ఉన్నప్పటికీ క్వార్టర్ల మధ్య ఖాళీస్థలాలు ఇళ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన లేఔట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఇంటి కిటికీ పక్కన నిల్చున్న ప్రతిమాపురి పరిసరాలను గమనిస్తున్నప్పటికీ ఉద్విగ్నత మనసులో మంచుపొరలా కమ్ముకుపోయింది.

అంతవరకూ నిరుద్యోగం అంటే ఏమిటో ఆమెకు అర్థం అయ్యేది కాదు. ఇంట్లో అన్నయ్య... అతనితో అల్లరి చిల్లరిగా తిరిగే స్నేహితులు నిరుద్యోగులుగా ఎంతకాలం ఉంటారు అని అందరూ అడుగుతుంటే నిరుద్యోగం గురించి తెలుసుకుంది.

ఉద్యోగం కోసం ప్రయత్నించట్లేదు. చేయాలన్న ఆసక్తి కూడా లేదు. సాంప్రదాయకమైన కుటుంబంలో పుట్టిన ప్రతిమ ఆఫీసులో కదలకుండా చేసుకునే గుమస్తా ఉద్యోగం కాని, ఏ ఇంగ్లీషు మీడియం స్కూల్లోనో టీచరు ఉద్యోగం కాని చేయాలని ఏ మూలో ఆశగా ఉండేది. అయితే మనసులో కోరికను ఆమె ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదు. అందుకోసం ప్రయత్నం కూడా చేయలేదు.

ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వ ప్రకటన ఇంగ్లీషు దినపత్రికలో చూసి సరదాగా దరఖాస్తు పంపింది. వారు కోరిన ప్రకారం ఫొటో, విద్యార్హతల వంటివి దరఖాస్తుతోబాటు జత చేసింది.

తన ఆశలకు అనుగుణమైన ఉద్యోగం కాదని తెలుసు. ఆ ఉద్యోగం తనకు లభిస్తుందన్న నమ్మకం కూడా లేదు. మనసు మారుమూలల్లో ఏదో ఆశ ప్రతిమను ఆ పనికి పురికొల్పింది.

అయితే ఆమె ఊహలకు భిన్నంగా పిలుపు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ద్వారా వచ్చిన ఉత్తరం ఎన్నిసార్లు చదువుకుందో లెక్కలేదు. అమ్మానాన్నలకు, ఇంట్లోవారికి అందరికీ చూపించి పొంగిపోయింది. ప్రతిమాపురిని అదృష్టం వెతుక్కుని వచ్చిందని అందరూ పొగడ్తలతో ముంచెత్తారు. ఇరుగు పొరుగు వారిలో కొంతమంది కళ్లల్లో ఈర్ష్యను ప్రతిమ ప్రస్ఫుటంగా గమనించింది.

సాధారణంగా ఉద్యోగం లభిస్తే చాలా మందికి ఆనందం కలుగుతుంది. అలాంటిది ప్రతిమాపురికి లభించిన ఉద్యోగం అరుదైనది కావడంతో ఎంతో ఆనందం కలిగింది. భారతదేశంలో ఎవరికీ లభించని పురస్కారం ఉద్యోగం ద్వారా తనకు లభిస్తుందని తెలుసుకుని ఎంతో పొంగిపోయింది.

భారతదేశంలో రేడియో మంచి ప్రాచుర్యమున్న కాలంలో, దూరదర్శన్ పేరుతో టెలివిజన్ ప్రసారాలను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 1958లో ఇందుకు తగిన ఏర్పాట్లు చేసింది. నలుపు తెలుపు టీవీల రూపకల్పన జరిగింది. కొన్ని ధనికవర్గాలు, కొన్ని కార్యాలయాలు మాత్రం వీటిని కొనగలిగాయి.

దేశం మొత్తం మీద గొప్ప ప్రచారం జరిగింది.

అంతవరకూ రేడియోలో ప్రసారాలు మాత్రమే వినగలిగిన ప్రజలు టెలివిజన్‌లో మనుషులు కూడా కనిపిస్తారని విని విస్తుపోయారు. ప్రసారాల ప్రారంభానికి ముందే ప్రభుత్వం రకరకాల పత్రికా ప్రకటనలు విడుదల చేయడంతో ప్రజల్లో మరింత ఆసక్తి పెరిగిపోయింది. టీవీల్లో బొమ్మలు ఎప్పుడు కనబడతాయా అని ఎంతో ఎదురు చూశారు.

కేంద్రప్రభుత్వ సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ అప్ లింకింగ్ ద్వారా ప్రసారాలు ఎలా వస్తున్నాయో ప్రయోగాలు కూడా పూర్తి చేసింది. ట్రయల్‌గా చిత్రీకరించిన సన్నివేశాలను ప్రసారం చేశారు. దూరదర్శన్ స్టూడియోలో వాటిని చూసిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రసారాలను అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం ఆమోదముద్ర కూడా వేసింది.

కార్యక్రమాలను ప్రమోట్ చేయడానికి, అనౌన్సు చేయడానికి, మధ్య మధ్యలో యాంకరింగ్ చేయడానికి అందమైన స్త్రీ ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయంగా ఖరారు అయింది.

ఆ సమయంలో ప్రతిమాపురి ఎంపిక జరిగింది.

అంతవరకూ కార్యక్రమాల గూర్చి ఎవరికీ అవగాహన లేదు. ఏ విధంగా ప్రజెంట్ చేయాలో నిర్దిష్టమైన విధానం లేదు. అయినప్పటికీ ప్రతిమ అధైర్యపడలేదు. తనలో సృజనాత్మక ఆలోచనలకు రూపకల్పన చేసింది.

1959 సెప్టెంబర్ 15.

దూరదర్శన్ ప్రసారాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రతిమాపురి మేకప్ అయింది. అంతకు ముందే కెమెరాలతో చిత్రీకరణ ఎలా ఉంటుందో, టెలివిజన్‌లో దృశ్యం ఎలా వస్తుందో పరిశీలన పూర్తయింది.

ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ సందేశాన్ని చిత్రీకరించవలసి వచ్చింది. ఉదయం 10.20 గంటలకు కార్యక్రమం మొదలైంది. ఆరోజు ఢిల్లీ, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎంపిక చేసిన కొన్నిచోట్ల ప్రభుత్వమే టెలివిజన్ సెట్లను అమర్చింది.

టీవీ ఆన్ చేయగానే మొదట మసకమసక గీతలు కనిపించాయి. తర్వాత ప్రతిమాపురి చిత్రం వచ్చింది. ఆమె రెండు చేతులెత్తి నమస్కరించి టెలివిజన్ వీక్షకులందరికీ స్వాగతం-సుస్వాగతం పలికింది.

తర్వాత రాష్ట్రపతి ప్రసంగం మొదలైంది.

ఎంతో ఆతృతపడిన ప్రజలు టీవీ ప్రసారాలను ఆసక్తితో తిలకించారు. భారతదేశంలో ఇతర ప్రాంతాలవారు మర్నాడు దినపత్రికల్లో ఈ వార్తను చూసి ఆనందించారు.

మొదటి కార్యక్రమ నిర్వాహకురాలిగా ప్రతిమాపురి గురించి కూడా టీవీ ప్రసారాల మాదిరిగానే తెలుసుకున్నారు.

గంట నిడివి గల ప్రోగ్రాం రూపొందించి, వారానికి రెండు రోజులు మాత్రం ప్రసారం చేసేవారు. ప్రభుత్వ అధికారుల అనుమతి పొందిన కార్యక్రమాలు టీవీలో వచ్చేవి. అప్పటి ప్రభుత్వ విధానాలు, సాంఘిక దురాచారాలను ఎదుర్కోవాలని ప్రబోధించే ఉపన్యాసాలు ఇందులో ప్రసారం జరిగేవి.

బుల్లితెరపై కనిపించిన ప్రప్రథమ మహిళగా ప్రతిమాపురి అనేక రికార్డులను సొంతం చేసుకుంది. అంతవరకూ దృశ్యరూపంలో ఉన్న కార్యక్రమాలు ఎలా ఉండాలన్న విషయాలు ఎవరూ చెప్పలేదు. అయినప్పటికీ ఆమెలో ఉన్న సృజనాత్మకత ఆమెను ఓ విలక్షణ మహిళగా తీర్చిదిద్దింది.

ఆ తర్వాత ఆమె మరి వెనక్కి తిరిగి చూడలేదు.

రోజురోజుకూ దూరదర్శన్ కార్యక్రమాల్లో నాణ్యతను పెంపొందించడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది. ఆ కృషికి ప్రతిమ యాంకరింగ్ ఎంతగానో తోడ్పడింది. రకరకాల కార్యక్రమాలను ప్రెజెంట్ చేయడం, వార్తలను చదవడం, ప్రముఖ వ్యక్తులను ఇంటర్వ్యూ చేయడం ఆమె ప్రత్యేకతలుగా ఉండేవి. ముఖ కవళికల్లో మార్పులు చేస్తూ ఆమె రూపకల్పన చేసే కార్యక్రమాలు ఎంతోమందిని ఎంతగానో ఆకట్టుకునేవి.

ఆ సమయంలో ఆమెకు ఓ అవకాశం లభించింది.

"ప్రతిమా! మన కార్యక్రమాల పట్ల జనాభిప్రాయం సేకరించాం. కుటుంబంలో అందరికీ ఉపయోగపడే ఆకర్షణీయమైన కార్యక్రమాలు కావాలని కోరుతున్నారు!" అని దూరదర్శన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ భండారి చెప్పారు.

దూరదర్శన్‌లో రకరకాల కార్యక్రమాలు ప్రసారం అవుతున్నాయి. ఒక్కొక్క కార్యక్రమం ఒకో వర్గాన్నే ఆకట్టుకుంటోంది. ఆ వర్గం తప్ప ఇతరులు ఆ కార్యక్రమాన్ని చూడటం లేదు. ఎవరికి ఇష్టమైన కార్యక్రమాన్ని వారు వీక్షించడం సహజం. కానీ దూరదర్శన్ ఉన్న ఇంట్లో అందరినీ ఆకట్టుకునే ప్రోగ్రాం ఉంటే బాగుంటుంది..." అని ఆయన వివరంగా చెప్పారు.

వారం పదిరోజులు ప్రతిమ ఆలోచించింది.

ఆమె ఆలోచనల నుంచి 'ఘర్-పరివార్' కార్యక్రమం పుట్టింది. కుటుంబ సభ్యులందరూ చూసే ఈ కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. నవ్వుతూ, నవ్విస్తూ ఆమె చేసిన ఈ కార్యక్రమం చాలా సంవత్సరాల పాటు కొనసాగింది. ఆమె స్టయిల్, ఛార్మ్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీక్షకులంతా 'ఘర్-పరివార్ ప్రతిమ'గా ఆమెను పిలిచేవారు. ఆమె చూపులు, మాట్లాడే విధానం ప్రత్యేకంగా ఉండేది.

మొట్టమొదటిసారి చంద్రమండలంపైకి వెళ్లి తిరిగి వచ్చిన యూరీ గగారిన్ భారతదేశానికి వచ్చారు. ఆ సందర్భంగా ఆయన అనుభవాలను దూరదర్శన్ ప్రేక్షకులకు అందించే అవకాశం వచ్చింది.

గగారిన్ దంపతులను దూరదర్శన్ కేంద్రానికి ఆహ్వానించారు.

అతడిని ఇంటర్వ్యూ చేయడానికి ముందుగా రకరకాల ప్రశ్నలను తయారు చేసుకుంది. ఒక్కొక్క ప్రశ్న అడుగుతూ జవాబులను రాబట్టింది. ఈ కార్యక్రమం అరగంటపాటు ఎంతో ఆసక్తికరంగా సాగింది. వివిధ పత్రికల్లో వచ్చిన ఇంటర్వ్యూలకు భిన్నంగా ఉందని ఎంతోమంది మెచ్చుకున్నారు. దూరదర్శన్ అధికారులు ప్రతిమాపురి ప్రతిభను అభినందించారు.

ఆమె ఎంతోమంది దేశ విదేశీ ప్రముఖులను దూరదర్శన్ ద్వారా పరిచయం చేసేది. ఆ పరిచయ కార్యక్రమాల కన్నా ఈ ఇంటర్వ్యూ ఆమెకు మంచిపేరును తీసుకువచ్చింది.

గగారిన్ మాట్లాడిన ఇంగ్లీషు ఉచ్చారణకు అనుగుణంగా ప్రశ్నలు అందిస్తూ చంద్రమండలం గూర్చి కేవలం ఊహల్లో మాత్రమే ఉన్న అస్పష్టమైన విషయాలకు ఈ ఇంటర్వ్యూ తెర తీసింది. ఎన్నో వాస్తవ విషయాలు ప్రజలకు తెలిశాయి. తర్వాత ఈ ఇంటర్వ్యూను రెండుమూడు సార్లు పునఃప్రసారం కూడా చేశారు.

***   ***   ***



సాయంత్రం...

ఆకాశంలో మేఘాలు పరుగులు పెడుతున్నాయి. న్యూఢిల్లీలో ఆ అపార్టుమెంటు ముందు ప్రయివేటు టెలివిజన్ వ్యాన్ ఆగింది. అందులో నుంచి అయిదుగురు సిబ్బంది బిలబిలమని కిందకు దిగారు.

నాల్గవ ఫ్లోర్‌లో ప్రతిమాపురి క్వార్టర్ వద్దకు వెళ్లి తలుపు తట్టారు. తలుపు నెమ్మదిగా తెరుచుకుంది.

తలమీదుగా చీరకొంగు కప్పుకున్న ప్రతిమ తలుపు తీసింది. వయసుమీద పడ్డా, ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్నా... ఆమెలో హుషారు తగ్గలేదు. ప్రయివేటు టీవీ ఛానెల్ వారు ముందుగా ఫోన్‌లో సంప్రదించడం వల్ల వచ్చిన వారిని చూసి ఆమె ఆశ్చర్యం పోలేదు.

టీవీ సిబ్బంది తమ కార్యక్రమాలను చకచకా చేసుకుపోతున్నారు. టీవీ కెమెరాలను స్టాండుకు అమర్చారు. లైటింగ్ ఏర్పాట్లు సరిగా ఉన్నాయో లేదో అసిస్టెంట్లు సరిచూసుకుంటున్నారు. జీన్సు ప్యాంటు, టీ షర్టు వేసుకున్న అమ్మాయి, ప్రతిమ చుట్టూ తిరుగుతూనే ఉంది.

"ఆ కాలంలో ఇంటర్వ్యూ అంటే ఇంత హడావుడి ఉండేదికాదు. స్టూడియోకి వచ్చి కూర్చుంటే ప్రశ్నోత్తరాలు జరిగేవి. ముందుగా ప్రశ్నలన్నీ రాసుకుని సిద్ధపడే వాళ్లం"! అని ప్రతిమాపురి అంది.

"ప్రస్తుతం స్పీడ్ పెరిగిపోయింది. టీవీ ఛానెళ్లు బాగా పెరిగాయి. అప్పటికప్పుడు ప్రశ్నలు-జవాబులతో ఇంటర్వ్యూలు జరుగుతాయి!" అంది.

తర్వాత ఇంటర్వ్యూ కొనసాగింది. ఒకప్పుడు దూరదర్శన్‌లో యాంకరింగ్‌లో అనుభవాలు, ప్రస్తుతం మారుతున్న విధానాలు ఒక్కొక్కదాని గూర్చి ప్రతిమ వివరించింది. తన అనుభవంలో ఎదురైన సంఘటనలు, సాధించిన విజయాలను చెప్పింది. టీవీలో మూడు ఏంగిల్స్‌లో మొత్తం కార్యక్రమాన్ని చిత్రీకరించాయి.

"దేశంలో మొట్టమొదటి మహిళా యాంకరుగా మహిళలకు మీరిచ్చే సలహా ఏమిటి?"

ఈ ప్రశ్న అడగ్గానే మాట్లాడుతున్న ప్రతిమాపురి ఆగింది. అంతవరకూ జరిగిన సంభాషణల ద్వారా ఆమె గతంలోకి జారిపోయింది. అనుభవాలు, అనుభూతులు ఒక్కొక్కటి గుర్తుకు వస్తున్నాయి. గతమంతా ఆమె కళ్లముందు కదలాడింది. అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమర్చాయి.

"ఎంతోమందిని ఇంటర్వ్యూ చేసిన తనను ఇంటర్వ్యూ చేయడం గొప్ప అనుభవం. మహిళలు చేయలేని పని అంటూ ఏదీలేదు. ఏ పని అయినా పురుషులతో సమానంగా చేయగలరు. తాము ఎందులోనూ తీసిపోమంటూ వారు ముందడుగు వేయాలి. ఆకాశమే హద్దుగా ముందుకు దూసుకుపోవాలి. మహిళ ఈ పని చేయలేదు అని అనిపించుకోకూడదు. ఈ స్ఫూర్తితో ప్రతి స్త్రీ ముందుకు కదలాలి..' ప్రతిమాపురి చెప్పుకుపోతోంది.

ఆమె కళ్లల్లో వెలుగు టీవీ యాంకరుకు కొత్త ప్రపంచాన్ని చూపించింది.

త్రినేత్రి

ఎక్ఛేంజి మేళాలు!

"మొన్న ఏమైందంటే....

'పాత గొలుసులకు మెరుగు పెడతాం...పాత గొలుసులకు మెరుగు పెడతాం.....'

అని వీధిలోంచి అరుపినపడిందో లేదో నాతో మాట్లాతున్న అనసూయ ఒక్కుదుట్న బయటకెళ్ళి చూసింది.

ఏవిటే అలా స్ప్రింగులాగా పరుగెత్తుకుంటూ వీధిలోకి వచ్చావ్వూ...నాకర్ధంకాక నేనూ నీవెంట పడొచ్చా అన్నాను.

ఇకది చూడండి... ఈసురోమంటూ వెనక్కి ఇంట్లోకొచ్చి కూలబడి చెప్పుకొచ్చింది.

ఓ వారం పదిరోజుల కిందట వాడెవడో ఇట్లాగే పాత వస్తువుకి సరికొత్త వస్తువులిస్తాం అంటూ కేకవేస్తూ వచ్చాడంట!

ఏవిటో చూద్దామని వాణ్ణికాస్తా ఇంట్లోకి పిలిచిందిట.

అలా ఎవర్నిపడితే వాణ్ణి ఇలా నట్టింటోకి రానివ్వకూడదని దానికి తెలిచ్చావదు పిచ్చిమొద్దుకి. సరే...వాణ్ణి పిలిచిందని చెప్పాకదా...వాడొచ్చి పీటమేసుక్కూర్చుని, మీ పాత గొలుసుకి విలువకట్టి, దానికి తగ్గ కొత్త గొలుసు ఇస్తానన్నాట్ట.

అందులో ఏదన్నా మోసం ఉంటుందేమోనని జాగ్రత్త పడొద్దూ...పైగా ఏదో కాస్త పాతబడి మెరుగు తగ్గిన బంగారపు వొంటిపేట గొలుసు చూడమనిచ్చిందటండీ!

వాడు దాని బరువు తూచి చూసుకుని, తళతళాలాడుతున్న ఓ కొత్తగొలుసు తీసి, దాన్నీ తూచి....అమ్మగారూ ఏం చెయ్యమంటారూ...మీ గొలుసంతే బరువున్న గొలుసొక్కటీ ఇప్పుడు లేవండీ...ఓ అరగ్రామో, చిన్నమో ఎక్కువ తూగుతున్నవే ఉన్నాయమ్మగారూ...ఓ మూడొందలు ఇచ్చి తీసుకోండమ్మా అన్నాట్ట.

మా పిచ్చి అనసూయ కళ్ళకు ఆ కొత్త గొలును కొత్త మెరుగు మెరుపులే కనబడ్డట్టున్నాయి...మూడొందలా నాలుగొందలా... అది మా బామ్మనాటి బంగారం. ఒక్కపైసా కూడా ఇవ్వను. ఇస్తే ఇవ్వు. లేకపోతే వెళ్ళెళ్ళు అందిట.

వాడూ... ఈసారికిస్తా గానీ మరోసారిలా ఇవ్వననీ, ఆ పక్కింటావిడ అడిగితే ఒక్కపైసా కూడా తగ్గించలేదని చెప్పమ్మా అని నా మీద కూడా చెప్పి బాగా నమ్మబలికాడు. ఇంకేముందీ...అనసూయ పూర్తిగా వాడి బుట్టలో పడిపోయింది.

అనసూయ బామ్మ, దాని పెళ్ళిలో మెడలో వేసిన బంగారపు గొలుసు ఇచ్చి, వాడిచ్చిన గొలుసు తీసుకుంది. సింగారించింది. వాళ్లాయన అడక్కపోయినా, దాని తళతళలు చూపి మరీ చెప్పింది. అలా మురుసుకుని నాలుగురోజులు కాలేదు. మెడ దగ్గర దురదగా ఉందని గొలుసు తీసి గోక్కుందా...మళ్ళీ యథాప్రకారం మెడలో వేసుకోబోతూ చూసుకుంటేముందీ...రంగు వెలిసిపోయింది. వాళ్ళాయనకు తెలియకుండా వాళ్ళకు తెలిసిన బ్రహ్మంగారికి చూపిస్తే అసలు విషయం చెప్పాడుట...అది బంగారపుది కాదనీ...మెరుగు పెట్టిన గిల్టుగొలుసని చెప్పాట్ట!

ఇంకేముందీ...లబోదబోమని దాని మనసులోనే గొల్లుమంది. పైకంటే వాళ్ళాయనెక్కడ కోప్పడతాడోనని, నన్ను పిలిచి చెప్పండి పిన్నిగారూ అంది. పిచ్చి అనసూయ...పిచ్చి పిల్ల...మరీ లోకజ్ఞానం లేకపోతే ఎట్లా చెప్పండి?

ఆ మధ్య నేనూ అలాంటి మార్పిడీ బేరమే చేశాను. కానీ ఇలానా? నా దగ్గర అట్టాంటిట్టాంటి వేషాలు పన్జేయవుమరి!

అమ్మడూ బ్రదర్సు షాపువాడు ఆ మధ్య పట్టుచీరల ఎక్ఛేంజి మేళా పెట్టాడు. మీకు తెలుసుగా...

లక్షలులక్షలు పెట్టుబడి పెట్టి, అంతపెద్ద సెంటర్లో షాపుపెట్టుకున్నావాడిట్టాంటి మోసాలు ఎందుకు చేస్తాడు చెప్పండి?

నాకా... పదిహేను పట్టుచీరలు ఇనప్పీరువాలో పడివున్నాయి. ఐదేళ్ళక్రితం మా పదోపెళ్ళిరోజున మా వారు కొనిచ్చిన పట్టుచీర నాకంతగా నచ్చలేదు. ఓ మూడునాలుగు సార్లు కట్టుంటానేమో. ఆ చీర పట్టుకుని బయల్దేరా.

ఎందుకైనా మంచిదని కొత్తదిలాగా కనబడాలని పెట్రోలు వాషింగుకిచ్చి మరీ చక్కగా ఇస్త్రీ చేయించి, అప్పటి పేకింగ్ పెట్టిలో పెట్టుకుని మరీ వెళ్ళా.

మన దెబ్బకి ఆ షాపువాడు పడిపోయాడు. మనం అడిగిన చీర...పైసా ఎగస్ట్రా చెల్లింపు లేకుండా కొత్త చీర పట్టుకొచ్చా.

అలాగుండాలీ...తెలివంటే..."

ఇలాంటి పిన్నిగార్లు మనకు ప్రతీవీధిలోనూ కనబడుతుంటారు. వాళ్ళ వయస్సు కొంతమందికి అలా పెద్దరికం ఇప్పించేస్తుంది. అయినవాటికీ కానివాటికీ ఉచితసలహాలు పడేస్తుంటారు. ఎవరింట్లో శుభకార్యాలయినా వాటిలోకి జొరబడిపోతారు. ఇదుగో ఇలాంటి డొమెస్టిక్, నాన్‌డొమెస్టిక్ మోసాలగురించి తమకంతా తెలుసనుకుంటారు.

కానీ పాపం ఆ పిన్నిగారు... ఎక్ఛేంజికై తీసుకెళ్ళిన పట్టుచీరలోని జరీ వెండి దిగుబడి శాతం, తను తెచ్చుకున్న కొత్త చీరలోని జరీ శాతం తేడా వుంటుందని అనుకోలేదు.

తన పట్టుచీర మూడునాలుగు సార్లకన్నా ఎక్కువసార్లు కట్టలేదు కదా! అదే కెమికల్ డైయింగ్‌తో కొత్తచీరలా ప్యాకింగయి మరో కొత్త కస్టమర్‌కి అమ్మకమవుతుందనీ అనుకోలేదు.

అంతేకాదు అసలు ఆ ఎక్ఛేంజి మేళాలో పిన్నిగారడిగిన చీరే ఇచ్చినా...బహుశా అది పట్టు లాంటి సెమీ పట్టుచీర అయినా ఆమెకు తెలిసే అవకాశం లేదు. మన పిన్నిగారు మాత్రం తనెంతో తెలివిగా కొత్త పట్టుచీర తెచ్చుకోగలిగానని సంబరంలో ఉన్నారు!



టీ.వీ. డబ్బ పాడుగాను

డా॥ కాలువ మల్లయ్య

“ఘోన్ డబ్బచ్చె.. అరె పోనియ్... గదాంతోని ఎక్కడెక్కడి మనిషితోనయిన మాట్లాడచ్చుననుకుంటిమి... దాందేముంది అవుసరమున్నోల్లు పెట్టుకుంటరు... లేకుంటే లేదనూకుంటివి... గది కొంచెమంత నయ్యేమేననపించే .. టి.వి. డబ్బ గూడచ్చె.. గిది మొదట్లచ్చినప్పుడు మంచిగానే అనిపించింది. గంటో, రెండు గంటలో కొంచెమంత సేపో అట్ల సూత్తె గా సంగతి వేరాయె. దీన్నాశినం గాను.. మెల్లెమెల్లెగది ఇరువై నాలుగ్గంటలకచ్చి... పొద్దంత రాత్రంత చంపుక తినవట్టె. మన సమయాన్నంత మింగిపారెయ్యవట్టె... గీ ఇరువై నాలుగ్గంటల టీవచ్చినంక ఓ మాటా లేపాయె.. ఓ ముచ్చట లేపాయె... ఎవ్వలింటికి పెయినా టి.వి. పెట్టి కూసుండిరి... మనింటి కెవ్వలచ్చినా గంతేనాయె!

అవు.. ఎన్నో సంగతులు ముచ్చెట్లు పెట్టుకునెటోల్లం... గిపుడేం పాడైందిమరి? టిఫిన్లు తినుకుంది... చాలు దాక్కుంట గటే సూసుడాయె. గదాన్ని జూసుకుంటేం మాట్లాడ్తం సెప్పుండ్రి..! వట్టిగ పొడిపొడి మాటలేనాయె...గా లొల్లికి ఎవ్వలేం మాట్లాడ్తుండ్రో సరిగ్గ విన్రాకపాయె. చిత్తం శివునిమీద భక్తి చెప్పుల మీదన్నట్టే ఉండె... గిదెంత దాకచ్చిందంటె చెప్పుకుంటే మానం బోతది.. చెప్పుకోకుంటే పానం బోతదన్నట్టు గావట్టె..

మా పొల్లగాండ్లిద్దరు గా జైలుబళ్లేనే సదువుతండ్రా..? జైలు బడంటే జైలధికార్లు నడిపే బడిగాదు... జేలసొంటి బడి ... గదే.. అక్కన్నే తినుకుంట పండుకుంట సదువుకుంటరు సూడండ్రి..గా రెషిడెన్షినులో గదేందో బడి.. గండ్ల సదువుకునే పొల్లగాండ్లు సెలవులకు ఇంటి కచ్చిరి... వచ్చినోల్లు మాటోముచ్చటో కడుపునిండ మాట్లాడన్నా...? గదంతేం లేదు.. ఒక్కటి రొండు ముచ్చట్లు మాట్లాడ్తరు. టీవీ పెడ్తరు. టకటుకటుక గా బటన్లు ఒత్తుతనే ఉంటరు. గిదేందిరా అంటె మాకు గక్కడ టి.వి. సూడనియ్యరంటరు. మాట్లాడినట్టన్న లేకపోయెనంటె.. ఏముందే మాట్లాడుటానికంటరు. గా డబ్బనే మాట్లాడ్తుంది గదాంటరు. ఇగ సెలవులయినంకెల్ల పోతరు. ఇగో గిట్లుంది టి.వి. సంగతి. అదిపాయె గదాన్ని సూత్తాంటె ఏమన్న వత్తందా అంటె గాదేం లేకపాయె... గండ్ల జూపెట్టేదేందో, గదెవ్వల జీవితమో తెలువనే తెలువది .. గదెందుకు సూపెడుతుండ్రో గూడ అరుతం గాదు... ఒక్కొక్కసారి గదాన్ని సూత్తాంటె ముక్కలు ముక్కలు చేయ్యాలెననిపిత్తది. అరె గీ డబ్బ పాడుగాను గిట్లయిపాయేంది? ఊల్లల్ల గా మిత్తరయోర్లు, బుడిగె జంగమోల్లు, శారదాకాల్లు గీల్లంత కతలు చెప్పుతాంటె... వేషాలేసి ఆడ్తాంటె ఎంత గమ్మత్తనిపిచ్చేది? ఎంత సంబురం గుండేది...? గివ్వట్లల్ల ఏం పాడైంది..?”

కొలపుపెట్టి సెప్పినట్టు సెప్పకపోతనే ఉన్నడు చంద్రశేఖర్. చెప్పి చెప్పి మొసచ్చినట్టున్నదాగిండు..

“గందుకే నేనేం జేసిన్నో ఎరికేనా? గా డబ్బను తీసి మూలకు పడేసిన... మూలకు పడేత్తె ఇంట్ల ఆడోల్లూకుంటరా అంటరేమొ ? ఊకుండకుంటేం జేత్తరు..? ఉరుకులాడితె ఉరుకులాడనియ్... పోరగాండ్ల సదువులుండె.. ఇంట్ల గా డబ్బ ఒర్రుతాంటె పోరగాండ్లెట్ల సదువుకుంటరు? పోరగాండ్ల సదువుం జూపి గదాన్ని తీసేత్తనన్న. వాళ్ళను వేరే గదిల సదువుకొమ్మంటె సరిపోతది గదని మా అన్నది నా పెండ్లాం... గుంయ్‌గుంయ్‌మని టి.వి. ఒర్రుతాంటె గాల్లెట్లా సదువుతరని మొత్తుకున్న... పోరగాండ్ల సదువు నడ్డంబెట్టి ఇనిపించిన... తీసి మూలకు పడేసిన... వాళ్ళ సదువులయిపోయి అవుతలికి పెయినంకనే టి.వి. అని సముదాయించిన. పొల్లగాండ్లు డాక్టర్లు, ఇంజనీర్లు కావన్నని ఆశాయె... ఇగొప్పుకున్నది...” అన్నడు నవ్వుకుంట వెంకట్రాజం.

“గాల్లనే ఒప్పించినవంటె నువ్వు సిపాయివే వెంకట్రాజం... మనం మా ఊకుంటంగని టి.వి. బందు జేత్తనంటె ఆడోల్లూకుండుడు కష్టం... గదాని కోసురం మనం లడాయి సెయ్యవలసత్తది... ఒప్పిచ్చి మూలను పడేసినందుకు నీకు అవార్డునియ్యాలె... ఇత్తామంటె గిప్పుడు పైసల్లెవ్వు” అని పక్కడ పక్కడ నవ్వబట్టిండు మల్రెడ్డి...

“ నిజమేనే... గీ ఆడోల్లు, మొగోల్లు గా డబ్బాలకెందు కతుక్కపోతరో తెలుత్తలేదు... మరి గండ్లేమన్న మంచియత్తున్నయా అంటె గదేంలేదు గద”

“అవు... గండ్ల జూపేటియి ఎవ్వలకు సంబంధించినయని? ఆడోల్లు నడుమ పగలు పెంచుటానికే గద గవన్నీ... అత్తాకోడండ్ల నడుమ కక్షలు, ఆడబిడ్డల సాధింపులు... పెండ్లాం మొగల చాలెంజ్‌లు... రంకులు... పగలు...అందరి నడుమ ద్వేషాలు పెంచుడు గివ్వేగద గండ్లుండేటియి... ఒగ సీరియల్ల ఓ పెండ్లాం మొగనితోనంటిది... ఓ కోటి రూపాయలు పాకెట్‌మనీగా ఇయ్యిమని... గదేందన్నట్టు? వ్యాపారం సేత్తే కోట్లకు కోట్లు వచ్చుడో పోవుడో గిదే సంగతి... గివ్విటితోని ఒల్లెక్కానికి కోట్లు సంపాయించచ్చన్న భావం పెరుగుతంది కదా ! వాళ్ల మెదల్లెట్ల తయారైతె” అన్నడు చంద్రశేఖర్.

గాల్లంత టి.వి. లీలల గురించి జోరుదారుగ మాట్లాడ్తుండ్రు...

“గంతేననుకుంటున్నారా ఏందింక? మనం మర్చిపోతున్న దయ్యాలు, భూతాలు, అతీతశక్తులు ఇంకెవ్వెవ్వో వాట్ని గురించి యాజ్జేత్తండ్రు... అన్నడు వెంట్రాజం...

“మనయి గాని భావాలను మనమీద రుద్దుతండ్రు... ముఖ్యంగా ఆడోల్లను పీడించుట్ల మన తెలుగు సీరియల్లు అన్నీటికంటె ముందుంటయి.

“గీ సంగతందరికెరికే.కని గా ప్రవాహాన్ని తట్టుకొని నిలవడుడు కష్టమైన పనే... గీ ఇరువై నాలుగ్గంటల ప్రోగ్రాములే ఓ కుట్ర... గిదంతెందుకన్నట్టు...? దొరికితె తిను లేకుంటె లేదు. దేన్ని గురించాలోసించద్దు.. టి.వి. సూసుకుంటుండు. గది గూడ సూపెట్టిందిసూడు... గప్‌చుప్.. ఇంకేం మాట్లాడద్దు... గంతే.... ” అన్నడు చంద్రశేఖర్.

“ఏందేమొ ఒగలకంటె ఒగలెక్కువ రెచ్చిపోయి మాట్లాడ్తండ్రు... గా టి.వి. డబ్బతో అన్ని నష్టాలే ఉన్నయా? లాభాలేం లెవ్వా...అరే... గది ప్రపంచాన్ని తీసుకచ్చి మనకండ్ల ముంగట పెడుతంది. దాంతోనెంత తెలివి పెరుగుతంది...” అన్నడు శ్రీనివాస్

గయనెకు టి.వి. చూసుడంటె తెగిష్టం...

‘గా డబ్బ ప్రపంచాన్ని ఇంటి ముంగట పెడతందో, ఇంటెనుక పెడ్తందో కని... మనలనయితె మనలను గాకుండా సేత్తంది శ్రీనివాసన్నా? గది ఏ ప్రపంచాన్ని, ఎవ్వల ప్రపంచాన్ని మనముందు నిలబెడ్తంది? ఎందుకు నిలబెడ్తంది? గా దెవ్వలకుపయోగపడ్తంది... ఇరువై నాలుగ్గంటలు టి.వి. ప్రోగ్రాములంటె ఇగ గండ్లేమన్న ఉన్నదా?;గదెందుకున్నట్టు...? పోనియ్యి గా ప్రోగ్రాములెట్లుంటన్నయి? గా అవాస్తవిక సుత్తి ప్రోగ్రాములతో మనమేం నేర్చుకుంటాం? ప్రజలేం నేర్సుకుంటరు.” అని చెప్పుకపోతనే ఉన్నడు చంద్రశేఖర్.

“మేం...ఒరోర్రి సత్తున్నం. నువ్వేమొ సప్పుడు జెయ్యకుంట మాంచిగ కూసున్నవు. గిట్లుంటాదె రాజమల్లన్న...? మరి గిసొంటాటికి విరుగుడు లేదానె” అన్నడు వెంకట్రాజం..

“మీరు జోరుదారుగనే మాట్లాడ్తున్నరు గదాని నేనూకున్న. విరుగుడు గూడ మీరు సానతీర్లనే చెప్పిండ్రు. గివ్విటితోని మధ్యతరగతాడోల్లు పత్రికలు సదువకుంటయి పెయిండ్రు. గాల్లకెన్ని తీర్ల నష్టమైతుందో తెల్సుకుంటలేరు. దీనికి నాకయితె ఒక్కటే విరుగుడు కనువడ్తంది. బాగ సదువుడు... పుస్తకం ఆలోచింపజేత్తది గద..! గందుకోసం అందరు పుస్తకాలు బాగ సదువాలె. గదానికతుక్క పోయే సమయాన్ని పుస్తకం సదువుటానికుపయోగించాలె...” అన్నడు రాజమల్లు.

డయాబెటిస్ పాదం

డా॥ కె.ఎల్.వి. ప్రసాద్

చక్కెర పాదం అన్నమాట వింటే చాలా మందికి ఆశ్చర్యం వేస్తుంది. కారణం డయాబెటిస్‌కూ, చక్కెర పాదానికి సంబంధం ఏమిటని? నిజంగానే చక్కెరకు, పాదానికి సంబంధం లేదు గాని, చక్కెర వ్యాధికి, ఆ వ్యాధిగ్రస్థులైన వారి పాదానికి ఎంతో సంబంధం ఉంది.

చక్కెర వ్యాధినే మధుమేహ వ్యాధి లేదా డయాబెటిస్ వ్యాధి అంటారు. ఈ వ్యాధిగ్రస్థులైన వారు బొత్తిగా అశ్రద్ధ గల వారయితే వారి పాదాలకు భయంకరమైన సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటి సమస్యను "డయాబెటిక్ ఫుట్" అంటారు. ఇక్కడ అందరికీ అర్థం కావడం కోసం 'చక్కెర వ్యాధి పాదం' అని వివరించడం జరుగుతున్నది.

అసలు మధుమేహ వ్యాధి అంటేనే తుంటరి వ్యాధి. దీనిని అశ్రద్ధ చేస్తే పిచ్చెక్కి చిందులు వేస్తుంది, మన చేత భయందోళనలతో చిందులు వేయిస్తుంది. దీనిని కనిపెట్టి క్రమశిక్షణతో వైద్యం చేయించుకుంటే దీనివల్ల ఎలాంటి సమస్యా ఎదురు కాదు. కాని అశ్రద్ధ చేస్తే (తెలిసి కొంత మంది, తెలియక కొంత మంది) అది శరీరం లోని ప్రతి అంగాన్ని, అంగ విభాగాన్ని తాకి సర్వనాశనం చేస్తుంది. అలాంటి వాటిల్లో 'పాదం' ఒకటి.

మార్తమ్మ రెండు సంవత్సరాల క్రితం మధుమేహ వ్యాధికి మందు వేసుకోవడం మానకుండా ఉంటే, ఈ రోజున ఆమె తన కుడి కాలిని పోగొట్టుకొని ఉండేది కాదు. అంతే కాదు కనీసం తను కొత్తగా కొనుక్కున్న స్కూటర్ స్టార్ట్ చేస్తున్నప్పుడు తగిలిన దెబ్బను తక్షణం డాక్టరుకు చూపించి ఉన్నా ఆమె తన కాలును రక్షించుకుని ఉండేది. ఆమె తన రోజువారీ పనుల్లో లీనమై దెబ్బ తగిలిన చోట పుండు పడినా పట్టించుకోలేదు.

తర్వాత తను వ్యాధి నిరోధక బిళ్లలు, బాధా నివారణ బిళ్లలు వాడినా ప్రయోజనం లేకుండా పోయింది. రక్త పరీక్ష చేయించుకోవడంతో, రక్తంలో చక్కెర శాతం బాగా పెరిగిపోయినట్లుగా తేలింది. ఆ పరిస్థితిలో ఆమె మోకాలి కింది భాగం కాలును తీసివేయక తప్పలేదు. ఇదిగో చక్కెర వ్యాధి పాదం తెచ్చే ముప్పు ఇంత సీరియస్‌గా ఉంటుంది.

మార్తమ్మ లాంటి వాళ్లు మనదేశంలో ఉన్న మూడు కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో ఒకరు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల మేరకు వచ్చే రెండు దశాబ్దాల కాలంలో ఈ సంఖ్య నాలుగు కోట్లకు చేరుతుంది. అతి త్వరలో మనదేశం ప్రపంచలోనే మధుమేహ పట్టణంగా రూపొందడానికి సిద్ధంగా ఉందట! ఒక్క బెంగుళూరు సిటీని దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే, సుమారు ఎనిమిది లక్షల మంది మధుమేహ వ్యాధిగ్రస్థులు అక్కడ ఉన్నారట! పైగా అందులో సుమారు ముప్పయి రెండు వేలమంది కాలి సమస్యలతో బాధపడ్తున్న వారేనట!

మధుమేహ వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధికాక పోయినప్పటికీ సకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారాను, వ్యాధి గురించిన అవగాహన పొందడం ద్వారాను కొంత వరకైనా వ్యాధి ప్రమాద స్థాయి నుంచి తప్పించుకోవచ్చు.

నయం చేయలేని దీర్ఘకాలిక మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో ఈ వ్యాధి వల్ల మూత్రపిండాలు, గుండె, కళ్లు, పళ్లు, మెదడు, రక్తనాళాలు, కాళ్లు, పాదాలు వ్యాధిగ్రస్థమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పాదాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలోనూ, పాద-ఆరోగ్య సంరక్షణలోనూ పాశ్చాత్య దేశాలతో పోల్చి చూస్తే మనం ఎంతగానో వెనుకబడి ఉన్నాం. అందువలన మనదేశంలో ఈ వ్యాధి మూలాన కాలు తీసివేసే సంఘటనలు (ఏంప్యూటేషన్) అధికంగా ఉంటున్నాయి.

మధుమేహ వ్యాధి వల్ల, దాని ప్రభావం నరాల మీద పడి, ఆయా నరాలు క్షీణించిపోయే పరిస్థితులు ఏర్పడడంవల్ల (డయాబెటిక్ న్యూరోపతి) పాదాలకు స్పర్శ జ్ఞానం తగ్గిపోతుంది. అందుచేత ఈ వ్యాధిగ్రస్తులు చెప్పులు ధరించకుండా నడిచినట్లయితే, సూదులు గుచ్చుకున్నా, పదునైన రాళ్లు గుచ్చుకున్నా, గాజు ముక్కలు గుచ్చుకున్నా, వాటి ప్రమాదం

తెలియకుండా ఉండిపోతుంది. అందుచేత అలాంటి గాయాలు వ్యాధిగ్రస్థమై తీవ్రస్థాయికి చేరుకుని ప్రమాద స్థితికి దారి తీయవచ్చు. పాదానికి (మడమకు) పగుళ్లు ఉన్నా, ఆనెకాయలు (కార్న్) ఉన్నా, అవి పుండుగా మారి ఆనక కాలిని తీసివేయవలసిన దురదృష్టకర పరిస్థితులు ఏర్పడవచ్చు.

అందుచేత ఈ విషయాల గురించి ప్రజలలో సరైనా అవగాహన తీసుకురావడానికి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు మనదేశంలో అనేక విధాలుగా పరిశ్రమిస్తున్నాయి. అటువంటి సంస్థల్లో బెంగుళూర్‌కు చెందిన 'జివాసీ' (జైన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాస్క్యులార్ సైన్సెస్) అనే సంస్థ ఒకటి. వీరు చేపట్టిన ప్రధాన అంశాలు ఏమంటే తరచుగా పాదాలను పరీక్షించడం, వాటి సంరక్షణ పట్ల సలహాలు సూచించడం, నరాల బలహీనతను అంచనా వేయడం, రక్త నాళాలలోని మార్పులను గమనించడం, అనుకోని రీతిలో అధిక ఒత్తిడికి గురయ్యే పాద భాగాలను గురించి వివరించడం, వ్యాధిగ్రస్థులు తప్పని సరిగా పాదరక్షలు ధరించే విధంగా అలవాటు చేయడం వంటివి. 'ఫుట్ స్కానర్' అనే యంత్రం ద్వారా పాదానికి ఏర్పడే ఒత్తిడి భాగాలను కనుగొని, ఆయా భాగాలు పుండుగా మారకుండా తగిన జాగ్రత్తలు వారు వివరించడం జరుగుతున్నది.

గ్రామీణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని జివాసీ సంస్థ కొన్ని ఆసుపత్రులను గుర్తించింది. వీటిల్లో తప్పనిసరిగా చక్కెర వ్యాధి పాదాలకు సంబంధించిన క్లినిక్కులు ఉంటాయి. వీరు రోజుకు కనీసం పది మందికి 'చక్కెర వ్యాధి పాదం' విషయంలో కౌన్సిలింగ్ చేస్తారు.

రాబోయే రెండు సంవత్సరాలలో, ప్రతి మూడు నెలలకొకసారి 'చక్కెర వ్యాధి పాదం' వచ్చిన వారి కోసం, పాదం సంరక్షణా పద్ధతులను సవివరంగా తెలియజెప్పడం కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించ బోతోంది. ఈ విధంగా చేయడం ద్వారా కాలు తీసివేసే పరిస్థితులను కనీసం నూటికి సగం తగ్గించేట్లు చేయాలనేది వారి అభిలాష.

ప్రత్యేక పాదరక్షల ఆవశ్యకత

ప్రత్యేక పాదరక్షలు వాడడం ద్వారా పాదాలకు పుండు పడకుండా కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. ఒక కాలికి 'చక్కెర పాదం' సమస్య వచ్చి ఆ కాలిని తీసివేసినట్లయితే ముప్పయి శాతం మందిలో మిగతా కాలికి కూడా ఈ సమస్య వచ్చే అవకాశం ఉంది. అందుచేత ఇలాంటి వారు తప్పని సరిగా ప్రత్యేక పాదరక్షల గురించి ఆలోచించాలి. ఈ పాదరక్షలలోని ప్రత్యేకత ఏమిటంటే నడుస్తున్నప్పుడు కాలిపాదం మీదపడే బరువు సమానంగా పడడానికి, ఏ ప్రాంతంలోనూ అధిక ఒత్తిడి పడి పుండు పడకుండా ఈ చెప్పులు కాపాడతాయి.

మధుమేహంతో బాధ పడ్తున్న రైతు సోదరులు మాత్రం తప్పని సరిగా మోకాలి వరకు వచ్చే బూట్లు వాడడం మంచిది.

హెచ్చరిక : జీవనశైలిని జాగ్రత్తలతో మలచుకుంటే మధుమేహం వల్ల ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కావు. అజాగ్రత్తగా ఉండే వారికి మాత్రం శరీరంలోని అన్ని అంగాలు- అంగ విభాగాలు వ్యాధిగ్రస్థమై చివరకు ప్రాణాపాయం కలిగే పరిస్థితులు రావచ్చు. అందుచేత మధుమేహ వ్యాధిగ్రస్థులారా తస్మాత్ జాగ్రత్త!! ✤

రక్త పదార్థాల మార్పిడి ప్రక్రియ

ప్రధానంగా ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ఆల్బుమిన్, గ్లోబ్యులిన్, ఫైబ్రినోజెన్ అనబడే ప్రోటీన్‌లతో నిర్మితమవుతుంది. వీటినే విడివిడిగా రక్త పదార్థాలు (బ్లడ్ కాంపోనెంట్స్) అంటారు. వీటిలో రోగి వ్యాధిని, అవసరాన్ని బట్టి మొత్తం రక్తమార్పిడి చేయకుండా ఏ రక్త పదార్థం అవసరమయితే దానినే రోగికి ఎక్కించడాన్ని రక్తపదార్థాల మార్పిడి లేదా బ్లడ్ కాంపోనెంట్ థెరపి అంటారు. పాశ్చాత్య దేశాలలో ఈ పద్ధతి ఎప్పటినుంచో వున్నప్పటికీ, మన దేశంలో ఇప్పుడిప్పుడే ఈ పద్ధతికి ప్రాముఖ్యం పెరుగుతున్నది.

రక్త పదార్థాల మార్పిడివల్ల ప్రయోజనాలను చర్చించే ముందు అసలు రక్త పదార్థాలను గురించి తెలుసుకోవడం అవసరం. మొత్తం రక్తంలో ప్లాస్మా 55 శాతం వరకు వుంటుంది. ఇది రక్తంలోని ద్రవ రూప భాగం. దీనిలో 90 శాతం నీరుంటుంది. మిగిలిన పది శాతం ఆల్బుమిన్, గ్లోబ్యులిన్, ఫైబ్రినోజెన్ అనే ప్రధాన ప్రోటీన్ పదార్థాల్లతో పాటు సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, కాపర్ వంటి మూలకాలుంటాయి. ప్లాస్మాలోని ఈ ప్రోటీన్‌లు రక్తపీడనాన్ని నియంత్రిస్తాయి. ఫైబ్రినోజెన్ మాత్రం రక్తం గడ్డకట్టడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. ఈ ఫైబ్రినోజెన్‌ను తొలగించిన ప్లాస్మానే 'సీరం' అంటారు. ప్లాస్మా ప్రోటీన్‌లు ప్రధానంగా కాలేయంలో ఉత్పత్తి అవుతాయి.

రక్తంలో మిగిలిన 45 శాతం రక్తకణాలుంటాయి. వీటిలో ప్రధానమైనవి ఎర్ర రక్తకణాలు. ఇవి ఎముకల మూలుగ (బోన్ మానరో)లో ఉత్పత్తి అవుతాయి. వీటి జీవిత కాలం 120 రోజులుంటుంది. మానవ రక్తంలో ఇవి ఒక క్యూబిక్ మిల్లీ లీటరుకు 4.5 నుంచి 5.5 మిలియన్ల వరకు వుంటాయి. స్త్రీలలో ఈ సంఖ్య కాస్త తక్కువగా వుంటుంది. ప్రతిరోజూ సుమారు 20 వేల కోట్ల ఎర్ర రక్త కణాలు వుడుతుంటాయి. గిడుతుంటాయి. ఈ ఎర్ర రక్త కణాలలో 'హిమోగ్లోబిన్' అనే ఎర్రని వర్ణక పదార్థం వుంటుంది. ఇది ప్రాణవాయువు సరఫరాలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

రక్తంలోని మరో ప్రధాన రకమైన కణాలు తెల్ల రక్త కణాలు. వీటినే ల్యూకోసైట్స్ అంటారు. వీటిని మరల న్యూట్రోసైట్స్ అంటారు. వీటిని మరల న్యూట్రోఫిల్మ్, ఇసినోఫిల్స్, బేసోఫిల్స్, మోనోసైట్స్, లింఫోసైట్స్‌గా విభజించారు. ఆయా రక్తాన్ని బట్టి వీటికి కొన్ని గంటల నుంచి అయిదారు రోజుల వరకు జీవిత కాలముంటుంది. ఇవి ఒక క్యూబిక్ మిల్లీ లీటరు రక్తంలో 4 నుంచి 11 వేల వరకూ వుంటాయి. ల్యూకోసైట్స్ ముఖ్యంగా వ్యాధి నిరోధకతలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

ఇంకా రక్తకణాలలో ముఖ్యమైనవి ప్లేట్‌లెట్‌లు. ఇవి ఒక క్యూబిక్ మిల్లీ లీటరుకు 2 నుంచి 5 లక్షల వరకు వుంటాయి. వీటి జీవిత కాలం 5 నుంచి 9 రోజుల వరకు వుంటుంది. ఇవి రక్తం ఘనీభవించడంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి.

రక్తాన్ని పైన పేర్కొనబడిన వివిధ రక్త పదార్థాలుగా విడగొట్టే ప్రక్రియను 'కాలమ్ క్రొమాటో గ్రఫీ' అంటారు. ఈ మధ్యనే మన దేశంలో రక్త పదార్థాలను వేరుచేసే అత్యాధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో కూడిన బ్లడ్ బ్రేకింగ్ సెంటర్‌ను స్వీడన్ దేశ సహకారంతో బొంబాయిలో ఏర్పాటు చేశారు. మరో రెండు బ్లడ్ బ్రేకింగ్ సెంటర్‌లను మన దేశంలో నెలకొల్పడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిన్న మొన్నటి వరకు రక్త పదార్థాలు విదేశాల నుంచి దిగుమతి అయ్యేవి. వీటి వల్ల ఎయిడ్స్ వంటి భయంకర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు వుండడం వల్ల కేంద్ర ప్రభుత్వం విదేశీ రక్త పదార్థాలకు స్వస్తి చెప్పాలని నిర్ణయించింది.

రక్త పదార్థాల మార్పిడివల్ల రక్తం కొరత కొంతవరకు తగ్గుతుంది. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రక్తం నుంచి వేర్వేరు పదార్థాలను వేరుచేసి చాలామందికి ఎక్కించవచ్చు. ఉదాహరణకు హీమోఫీలియా వ్యాధిగల రోగికి కేవలం రక్తంలోని ఏంటి హీమోఫిలిక్ ఫ్యాక్టర్ (ఫ్యాక్టర్- VIII) యిస్తే సరిపోతుంది. అలాగే రక్తహీనతతో బాధపడేవారికి ఎర్ర రక్తకణాలు, కిడ్నీ మార్పిడి చేయించుకున్న వారికి తెల్ల రక్తకణాలు, రక్త కేన్సర్ రోగులకు ప్లాస్మా అవసరమవుతాయి. ఇంకా ప్రమాదవశాత్తు శరీరం కాలిన రోగులకు ప్లాస్మా అవసరమవుతుంది. దీర్ఘకాల కాలేయ వ్యాధులున్న వారికి రక్తంలోని ప్రోటీన్ పదార్థాలు యివ్వవలసి వుంటుంది.

రక్త పదార్థాలను మామూలు రక్తాన్ని నిల్వచేసే కాలం కన్నా ఎక్కువ కాలం నిల్వచేయవచ్చు. అంతేకాక రక్త మార్పిడుల వల్ల వ్యాప్తి చెందే చాలా వ్యాధులను చాల వరకు అరికట్టవచ్చు. ఏది ఏమైనా రక్తం కొరత అధికంగా వున్న కారణం గాను, రక్తమార్పిడి వల్ల వ్యాప్తి చెందుతున్న వ్యాధుల పరంగాను రక్తపదార్థాల మార్పిడి రోగుల పాలిట ఒక వరమనే చెప్పవలసి వుంటుంది. ✤

గుల్జార్ కథలు

ప్రముఖ గేయరచయిత, ప్రయోగవాద చిత్రాల దర్శకుడుగా పేరుగాంచిన గుల్జార్ మంచి కథకుడు కూడా. గుల్జార్ రాసిన కథల ఆంగ్ల అనువాదాన్ని చదివి ప్రభావితురాలైన డా॥కె.సునంద గారు వాటిని తెలుగులోకి అనువదించి పుస్తకరూపంలోకి తేవడం అభినందించదగ్గ విషయం.

గుల్జార్ కథలు రాశిలో తక్కువైనా వాసిలో ఎన్నదగినవి. చలన చిత్రాల రూపకల్పనలోనే కాదు, కథల చిత్రీకరణలో కూడా వైవిధ్యాన్ని కనబరచడం గుల్జార్ ప్రత్యేకత. వీరి కథల్లో మానవనాగరికత పరిణామ వికాసదశలో ఆది మానవుడు నిప్పును కనుక్కోవాడాన్ని "హాబు-అగ్ని" అనే కథలో అద్భుతంగా చిత్రీకరించారు. మానవ జనాభా పెరిగి జనావాసాలు కోసమో, రవాణా మార్గాల కోసమో అటవీ సంపద కోసమో అడవులను ధ్వంసం చేస్తున్నారు. దాంతో వాటిమీద ఆధారపడిన జీవజాలం నశించిపోతున్నవి. ఈ సంగతి గుర్తించిన అడవిలోని జంతువులు మానవుని ప్రయత్నాలను అడ్డుకుని తమ "జీవించేహక్కు" ను నిలబెట్టుకోవడానికి చేసే పోరాటం మనల్ని ఆకట్టుకుంటుంది.

కులమతాలు మానవుల మధ్య అడ్డుగోడలను సృష్టిస్తున్నాయి. 1947 నాటి దేశ విభజన హిందూ-ముస్లింలను శత్రు వర్గాలుగా మార్చేశాయి. దేశ విభజన నాటి భయానక పరిస్థితికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన గుల్జార్ తాను చూసిన హింసాకాండను, తన అనుభవాలను కథల రూపంలోకి మలిచారు. అప్పటిదాకా అన్నదమ్ముల్లాగా హాయిగా నేరేడు చెట్టుక్రింద ఆడుతూ పాడుతూ వున్న హిందూ, మహమ్మదీయ సోదరులు దేశ విభజనతో ఏ విధంగా బద్ధ శత్రువులయ్యారో చూపిన కథ "నేరేడు చెట్టు". సామూహిక హత్యా కాండతో చెలరేగిన మతకల్లోలాలనుండి ప్రాణాలరచేత బట్టుకుని పారిపోయి వస్తున్న యాసిన్, తనను చూసిన ప్రతివాడూ ఎక్కడ చంపుతాడోననే "భయం"తో రైలుపెట్టెలో దాక్కుంటాడు. ముందూ వెనక ఆలోచించకుండా ఆత్మ రక్షణార్థం రైలుపెట్టెలోంచి తోసేసిన వ్యక్తి "యా అల్లా" అని అరవడంతో స్థాణువై పోతాడు. తాము విధ్వంసం నుండి తప్పించుకుని సురక్షితంగా హిందూస్తాన్ చేరుతున్నామన్న ఉద్విగ్నతలో చనిపోయిన బిడ్డను కాకుండా, బతికివున్న పసికందును భార్య నుంచి లాక్కుని కదులుతున్న రైలునుండి కిందున్న నదిలోకి పడవేసి బిడ్డ ఏడ్పువిని ఖిన్నుడైన ఆ తండ్రి బాధను "ఆవలి ఒడ్డు"లో చూస్తాం. ఈ రెండు కథలు కొసమెరుపుతో వుండి మనల్ని షాక్ చేస్తాయి. మతకల్లోలాల సమయంలో భార్యాభర్తలు, తల్లీ పిల్లలు తప్పిపోయిన సందర్భాలు సరిహద్దుకు రెండువైపులా వున్నాయి. అలా తప్పిపోయిన తన బిడ్డను గుల్జార్‌లో చూసుకొని, అతడ్ని తన పిల్లవాడిగా నచ్చచెప్పడానికి విఫలయత్నం చేసిన ఒక తండ్రి ఆవేదన "పంపకం" కథలో మనసును కదిలిస్తుంది. మతమౌఢ్యం మనుషులను ఎంత కిరాతకంగా మార్చివేస్తుందో "పొగ" కథలో కనిపిస్తుంది. జమీందారు దౌర్జన్యాలతో బందిపోటు దొంగగా మారిన వ్యక్తి బలప్రయోగంతో, ధనరామ్ కమ్యూనిజం ప్రేరణతో సంఘటిత శక్తిగా జమీందారును ఎదిరించడానికి చేసిన ప్రయత్నమే "పంట"గా రూపుదాల్చింది. సాహిత్యం వేరు, జీవితం వేరుకాదు అని తెలియజేసే "ఎవరికథ"లో సామాజిక ప్రయోజనం లేని సాహిత్యం శుద్ధ దండగ అని తేల్చి వేస్తారు. ఇందులో ఏ కథ కా కథ వైవిధ్యభరితంగా రూపొంది ఆసక్తికరంగా చదివింపజేస్తాయి. అనువాదకర్త కృషి ప్రశంసనీయం.

-కె.పి. అశోక్‌కుమార్



"గుల్జార్ కథలు"
తెలుగు సేత: డా॥ కె.సునంద,
వెల 20రూ. పేజీలు 64.
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

స్వీకారం



అంతరంగ తరంగాలు
(స్మృతి రేఖలు)
రచన :తోటపల్లి లక్ష్మణకుమార్
ప్రతులకు : కవి, రొంపిచర్ల
గుంటూరుజిల్లా - 522 601

శ్రీ గూడవల్లి రామబ్రహ్మం
రచన :డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, వెల:రూ.48/-
ప్రతులకు : పి. రంగనాథగుప్త, 6-6-33, మెయిన్‌రోడ్, తెనాలి.

చిగుళ్ళు
(కవితా సంపుటి)
రచన :పురిజాల సుధాకర్, వెల: రూ. 10/-
ప్రతులకు : కవి, ప్లాట్‌నెం. 90, శ్రీరామ్‌నగర్
సరసన్నపేట - 532 421.

ప్రకృతిలో భాగం జోగ్ జలపాతం

సరోజిని

మన

దేశంలో అనేక రాష్ట్రాలలో ప్రకృతిసిద్ధమైన జలపాతాలు అనేక ఉన్నాయి. వాటిలో ప్రసిద్ధి గాంచిన జోగ్ జలపాతం కూడా ఉన్నాయి. ఇవి కర్నాటకలోని షిమోగా జిల్లాలో ఉన్నాయి. ప్రకృతి అందాల నిలయం షిమోగా. ఇక్కడ చూడదగ్గ ప్రదేశాలు అనేకం ఉన్నప్పటికీ జోగ్ జలపాతం తప్పక చూడదగింది. ఇది సహజ సిద్ధమైన అందాల నడుమ, దట్టమైన అరణ్యంలో, ఎత్తయిన పర్వతాలలో ఉన్నాయి.

ప్రకృతిసిద్ధమైన ఇతర పర్యాటక కేంద్రాలలో అక్కడి అందాలను కాపాడేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం పెద్దగా కష్టపడకుండానే ఈ ప్రదేశాన్ని కాపాడగలుగుతున్నారు. ఈ జోగ్ జలపాతం జిల్లా కేంద్రమైన షిమోగాకు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. 292 మీటర్ల ఎత్తున ఈ జలపాతం ఉంది. ఈ జలపాతాన్ని సందర్శించేందుకు మంచి సమయం జూన్ నుంచి నవంబర్ మధ్య కాలం. ఆ సమయంలో వర్షాల వల్ల వచ్చిన నీటితో జలపాతం కళకళలాడుతూ కనువిందు చేస్తుంది. వర్షాకాలం అనంతరం నీటితో ఉరకలు వేస్తున్న శరావతి నది నీటిలో జలపాతం చిందులుతొక్కుతూ ఉంటుంది. నదీ జలాలు 960 అడుగుల ఎత్తు నుంచి గలగలలాడుతూ ప్రవహిస్తాయి. శరావతి నది నాలుగు పాయలుగా చీలి ఈ జలపాతంగా అవతరించింది. ఈ నాలుగు పాయలకు రాజా, రాణి, రాకెట్, రోరర్ అని పేర్లు పెట్టారు. రాజా అత్యున్నతంగా 960 అడుగుల ఎత్తు నుంచి దూకుతుంది. అందువల్లనే దీనికి రాజా అనే నామకరణం చేశారు.

హొన్నెమారుడులో జల క్రీడలు

దీనికి కొంచెం దిగువగా రోరర్ వచ్చి రాజాతో కలుస్తుంది. ఇది పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ దూకుతుండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఇక మూడవపాయ జెట్‌ల మాదిరిగా దూకుతుంటుంది. అందువల్ల దానికి రాకెట్ అనే పేరు పెట్టారు. రాణి పేరుకు తగినట్లుగాను అద్భుత అందాలతో ఉంటుంది. దీని నీరు తెల్లని నురగలు తేలుతూ కిందికి దూకుతుంది. ఈ నాలుగు పాయలు కలిసి అద్భుత అందాలను మనకందిస్తున్నాయి. అదే సమయంలో ఒక్కొక్కటిగా

కూడా తమ అందాలను మనకు పంచిపెడతాయి. సూర్య కిరణాలు కొన్ని వాలులలో నీటిపై ప్రతిబింబించినప్పుడు అందాల ఇంద్రధనుస్సులోని రంగులు కన్పిస్తూ మనోల్లాసాన్నిస్తాయి. జలపాతం ఎగువ భాగం నుంచి సన్నని కాలిబాట ఉంది. ఆ కాలిబాటన జలపాతం పాద భాగానికి చేరుకోవచ్చు. అక్కడకు వెళ్ళడానికి సరైన మెట్లు లేనప్పటికీ ఎలాంటి ప్రమాదం లేకుండానే కిందికి దిగవచ్చు. ఈ జలపాతాన్ని సందర్శించిన వారు తప్పనిసరిగా పాదభాగానికి వెళ్లి తీరాల్సిందే. అక్కడి నుంచి శరావతి నది సోయగాలను తనివితీరా చూసేందుకు వీలుకలుగుతుంది. జలపాతం నుంచి వచ్చే నీటి తుంపరలతో తడవడం ఓ మరపురాని అనుభూతి.

జలపాతం అవలి దిక్కుకు వెళ్ళేందుకు అక్కడ ఆటో రిక్షాలు ఉన్నాయి. నది జలపాతంలోకి ప్రవేశించే దృశ్యాన్ని అక్కడి నుంచి తిలకించవచ్చు. ఆ నది ఎత్తయిన ప్రదేశం నుంచి లోయల్లోకి దూకడం చూస్తే తన్మయం చెందుతాము. దానికి సమీపంలోనే మైసా గేట్, మహాత్మాగాంధీ జల విద్యుత్ కేంద్ర కూడా ఉన్నాయి.

జల క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారు ఈ జలపాతానికి 15 కి.మీ. దూరంలో ఉన్న హొన్నెమారుడు సందర్శించవచ్చు. పశ్చిమ కనుమల మధ్య భాగంలో ఉన్న అడవుల్లో ఈ ప్రదేశం ఉంది. ఇది ప్రధానంగా సాహస కార్యాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడి అడవి కూడా ఎంతో ఆహ్లాదకరంగా, స్వచ్ఛంగా ఉంటుంది. ఇక్కడ ప్రధాన అంశాలుగా ఈత, కానోయింగ్, కయాకింగ్, కొరాక్లింగ్, రాఫ్టింగ్ వంటి జల క్రీడలు ఉంటాయి. ఇక్కడ అడవుల్లో రాత్రి పూట విశ్రమించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఆకాశమే పైకప్పుగా, మిణుకు మిణుకు తారలే దీపాలుగా రాత్రిని కూడా ఆస్వాదించవచ్చు.

జోగ్ జలపాతాన్ని సందర్శించేందుకు బెంగుళూరు నుంచి షిమోగా మీదుగా రాత్రి బస్సులు ఉన్నాయి. అలాగే సాగర్ మీదుగా షిమోగా నుంచి కూడా చాలా బస్‌లు ఉన్నాయి. సమీపంలోని రైల్వే జంక్షన్ తల్‌గుప్ప. నేరో గేజ్‌లో తల్‌గుప్పకు రైలు ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. జలపాతం ప్రాంతంలో చక్కటి హోటల్ సదుపాయం కూడా ఉంటుంది. కర్ణాటక రాష్ట్ర పర్యాటక శాఖ (కెఎస్‌టిడిసి) నిర్వహించే హోటల్ మయూరా గెర్సొప్పా అన్నింటికీ సదుపాయంగా ఉంటుంది. హోటల్ గదిలో కూర్చొని కూడా జలపాతం అందాలను తిలకించవచ్చు.

షిమోగా-తల్‌గుప్ప రైల్ బస్

'బొమ్మలాట'కు జీవం పోస్తున్న తాతా....



చలపాక ప్రకాష్

కళ మన సాంస్కృతిక జీవన ప్రతిబింబాలు. సమాజంలోని వివిధ రుగ్మతలను ఎత్తిచూపుతూ ప్రజలలో వినోదంతోపాటు విజ్ఞానానికీ, మానసిక వికాసానికీ తోడ్పడుతూ తద్వారా వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దటంలో కళలు ప్రముఖపాత్ర వహిస్తాయి. అటువంటి అరుదైన కళలలో కొన్నిటికి ఆదరణలేక కనుమరుగున పడిపోతూ, కొంతకాలానికి అంతరించిపోయే దిశలో వున్నాయనటంలో సందేహమే లేదు. అందులో ఒకటి తోలుబొమ్మలాట, కొయ్య, చేతి బొమ్మలాట. మరుగున పడిపోతున్న ఈ బొమ్మలాట కళకు కొత్తరూపంలో జీవం పోస్తూ, అక్షరాస్యతా ఉద్యమం కొరకు తీవ్రంగా కృషిచేస్తున్న ప్రదర్శనకారుడు తాతా రమేష్‌బాబు. కవిగా, చిత్రకారుడిగా, రచయితగా, రేడియో, టీవీ ఆర్టిస్టుగా సుపరిచితుడైన తాతారమేష్‌బాబు ఇటీవల 'పప్పెట్' కళపై ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు.

రమేష్‌బాబు తొలుత తన సాహిత్య, కళాజీవితాన్ని చిత్రకారుడిగా, కవిగా ప్రారంభించారు. అరుదైన 'పప్పెట్'షోలు ప్రదర్శిస్తూ, రాష్ట్రంలో ఈ కళ ప్రదర్శిస్తున్న కళాకారుల్లో ఒకరుగా గుర్తింపు పొందుతున్నారు. గుడివాడ ఎ.జి.కె మున్సిపల్ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నా... ప్రవృత్తిరీత్యా, బందరు, గుడివాడ సాహిత్య కళాభిమానులలో మంచిపేరును సంపాదించుకున్నారు

కవిగా, రచయితగా...

రమేష్‌బాబు రాసిన అనేక కథలు, కవితలు వివిధ ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడి పాఠకుల ప్రశంసలు అందుకున్నాయి. "అణువు పగిలింది", "విప్లవరుతువు" కవితా సంకలనాలు, "పిడికిలి" దీర్ఘకవిత, "తాతా రమేష్‌బాబు కథలు", "మేరా భారత్ మహాన్", "తొలిగీతాలు-1" తదితర గ్రంథాలు వెలువరించారు. పప్పెట్ ప్రక్రియలో కూడా "బొమ్మలాట", "నాన్నోయ్‌పులి", "చదువుకుందాం.రా..", "దిద్దుబాటు" పుస్తక రూపంలో తీసుకురావటం విశేషం. 'తార' అనే కలం పేరుతో రచనలు చేసిన రమేష్‌బాబు, సాహిత్య కళారంగాలకు చేసిన సేవకుగాను యునెస్కో, మిలీనియం కల్చరల్ అవార్డు, తెలుగుభారతి ప్రతిష్టాత్మక అవార్డు, తిలక్ విశిష్ట అవార్డు ఇలా ఎన్నో పురస్కారాలను కైవసం చేసుకున్నారు. సి.నా.రె, అక్కినేని నాగేశ్వరరావు వంటి ప్రముఖుల ప్రశంసలూ అందుకున్నారు.

'పప్పెట్ షో' కు చేస్తున్న కృషి:

'పప్పెట్- షో'గా ప్రసిద్ధి చెందుతున్న ఈ కళ కోసం రమేష్‌బాబు ఇటీవల తన మిగతా రచనా ప్రక్రియలను పక్కనపెట్టి, కేవలం ఈ కళకే తన పూర్తి కాలాన్ని వినియోగిస్తున్నారు. ఇక ఈ కళగురించి వివరించమని అడిగినప్పుడు, ఈ కళా ప్రదర్శన కోసం నాలుగు పాత్రలు ధరించాల్సి ఉంటుందన్నారు. ప్రదర్శనకారుడిగా, నాటక రచయితగా, బొమ్మలు తయారుచేసే శిల్పిగా, బొమ్మల పాత్రలకు డైలాగులు చెప్పే వ్యక్తిగా ఇలా చతుర్విధ ప్రక్రియల్లో ఈ కళాకారుడు తన నైపుణ్యాన్ని ప్రదర్శించి, ప్రేక్షకుల మెప్పును పొందవలసి వుంటుందని చెప్పారు. అక్షర సంక్రాంతి, ఎయిడ్స్ వ్యాధి నివారణ చర్యలు, పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి కథలు ప్రదర్శనలుగా ఇచ్చినప్పుడు నిరక్షరాస్యులనే కాకుండా, మేథావులను సైతం ఆకట్టుకున్నాయన్నారు. ఈ 'షో'లకు రాసిన రచనలు సినారె, అద్దేపల్లి, రావూరి భరద్వాజ, ఎన్.గోపి, ద్వానా శాస్త్రి వంటి ప్రముఖుల ప్రశంసలూ అందుకున్నాయని చెప్పారు. ఇప్పటివరకు రెండు వందలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి, ఈ ప్రక్రియలోనూ ఎన్నో అవార్డులు రివార్డులు పొందానన్నారు. 'ఇంతకంటే కళాకారుడిగా తనకేంకావాలి' అని తన ఆనందాన్ని వెలిబుచ్చారు. పప్పెట్ థియేటర్‌ను స్థాపించి, ఈ కళపై లోకమంతటా పర్యటించి, ఔత్సాహిక యువకులకు శిక్షణ కూడా ఇస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

గ్లో పప్పెట్స్, రాజ్‌పప్పెట్స్‌లో కూడా రమేష్‌బాబుది అందెవేసిన చేయి. పనికిరాని గుడ్డలు, కాగితం గుజ్జుతో బొమ్మలు చెయ్యటంతో పాటు వాటికి రంగులు కూడా రమేష్‌బాబే స్వయంగా వేసుకోవటం మరొక విశేషం. రెండు బొమ్మలనూ రెండు చేతులతో పట్టుకుని ఆడిస్తూ, పాత్రకు తగ్గ డైలాగులు చెప్పడమే కాకుండా, పాత్రకు తగ్గ కంఠం కూడా మారుస్తూ రమేష్ చేసే ప్రదర్శన ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తుంది. ఒకనాడు స్వాతంత్ర్య సంగ్రామంలో తోలుబొమ్మలాట ప్రదర్శనలు ప్రజల్ని ఏ విధంగా చైతన్యపరిచే దిశలోకి తీసుకెళ్ళాయో, ఈనాడు ఈ 'పప్పెట్' ప్రదర్శనలూ వివిధ సామాజిక సమస్యలపై చైతన్యపరుస్తున్నాయనటంలో సందేహమే లేదు. మనదేశ సాహితీ సంస్కృతులలోని పాత కళలకు ఆధునికతను జోడిస్తూ ఈనాటి తరం వారి చెంతకు చేరే విధంగా వాడవాడలా ప్రదర్శనలు ఇస్తున్న రమేష్‌బాబు కృషిని అభినందించి తీరాలి. వివిధ టి.వి ఛానల్స్‌లో సైతం అనేక పప్పెట్ షోలిచ్చిన రమేష్‌బాబు కళాసేవలను ప్రభుత్వం కూడా ప్రజలను చైతన్యపరిచే దిశలో వినియోగించాలి.

✳

మహాకవీ మన్నిస్తావా....

మహాకవి వాక్యాలకు
మరికొంత పొడిగింపు... నేటి వాస్తవం !
దేశమంటే మనుషులేకాదు
ఇవాళమట్టికూడా....
పురిటిగడ్డను సైతం
పునీతంగా భావించనివాడు
మనిషినెలా అభిమానిస్తాడు?
మానవీయతపై మమకారంలేనివాడు
మనసునెలా నమ్ముతాడు?
పాలుతాగి రొమ్ముగుద్దుతున్న కల్మషపు మనుషులూ...
తినేతిండీ పీల్చేగాలీ
తాగేనీరూ వగరు నోరూ
మనోకాలుష్యపు కాసారంలో
మునిగితేలుతున్నప్పుడు
మట్టిస్పర్శ తెలియనే తెలియదు
వొట్టిమాటలు కట్టిపెట్టమంటే
కల్లబొల్లి కబుర్ల "సంత"కం పేట్టే రోజులివి
సొంత లాభం కొంత మానుకోమంటే
"పొరుగు" అనే మాటే పరాయిదయి పోతోంది

"దిద్దుబాటు" రాయితో
కథల సౌధానికి
నువ్వు వేసిన పునాది
చెక్కు చెదరని కాంక్రీటే....
ఒక్క గిరీశాన్ని సృష్టించావు
చుట్టూ తిరిగి చూస్తే
ఇప్పుడు ఎక్కడ చూసినా
"గిరి" గీసుకున్న ఈశాలే!
మనుషుల్నీ మనసుల్నీ మథించి
సమాజాన్ని ఎక్స్‌రే తీసి
ముత్యాలసరాలు పేర్చిన నీ చేతి కలం
ఇక చిరంజీవే!
దేశమంటే మనుషులేనోయ్
అయితే...
ఆ మనుషులు
మట్టిమనుషులైతే
మరీ మేలోయ్...!

-సోమేపల్లి వెంకటసుబ్బయ్య

వాస్తు

మతమే కాదు
మరమూ
మారణహోమం చేస్తోంది

రూపాయి
గీతోపదేశం చేస్తోంది
పైస
పవిత్ర ఖురాన్ పఠిస్తోంది
డాలర్
బైబిల్ వాక్యం చెబుతోంది

స్వాములు బాబాలు ఇమాములు
అందరూ కాకపోయినా...కొందరు
సైతాను అవతారం సంపూర్ణం చేశారు

కంచి పుట్టపర్తి పాతబస్తీ
ఒక మొత్తంగా గుజరాత్
తడియారని నెత్తుటి గడియారాలు

అవును
నెత్తుటి పిడిబాకు...
ఈ కల్లోలదేశంలో ఏం
జరుగుతోంది?!



వెయ్యికాళ్ళ మంటపం శిథిలాల్లో
వేనుడి నవ్వు
ఉదయించింది
దేవాలయాల్లో మసీదుల్లో చర్చిల్లో
దయ్యం
ప్రార్థన చేస్తోంది

పిరికిపందల్లారా!
ఇక్కడి నిర్మాణాలకు,
ఈ దేశానికి కాదురా
గాలి వెలుతురు సోకని
ఇక్కడి
పాలకులకు వాస్తులేదు
ఇక్కడి
రాజకీయాలకు వాస్తులేదు
బహుశా
ఇక్కడి
రాజ్యాంగానికి వాస్తులేదు.

- వడ్డెబోయిన శ్రీనివాస్

న్యాయసలహాలు



జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఫైనాన్స్ కంపెనీలో నా డబ్బు....;?

నేను సదరన్ ఉద్యాన్స్ లిమిటెడ్ అనే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలో మిత్రుల ప్రోత్బలంతో, డిపాజిట్టు చేసిన డబ్బు మూడు సంవత్సరాలలో రెట్టింపు అవుతుందంటే, 2000 సంవత్సరంలో రు. 56,000లు డిపాజిట్ చేశాను. ప్రస్తుతం కంపెనీ మూసివేయబడింది. లిక్విడేషన్‌లో ఉన్నదని, ఈ కంపెనీపై కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నవని తెలిసింది. నా డబ్బు తిరిగి వచ్చే మార్గముందా? లిక్విడేషన్ ఎలా చేస్తారు? లిక్విడేషన్ అనంతరం డిపాజిట్‌దారులకు ఏ విధంగా సమాచారం అందిస్తారు. ఈ విషయంలో నేను ఏ విధంగా ప్రయత్నం చేయాలి ? కంపెనీలో నేను డిపాజిట్ చేసిన రు. 56,000లకు గాను కంపెనీ బాండ్ పేపర్స్, నేను పెట్టిన డబ్బుకు తగిన యూనిట్ల భూమిని కేటాయించినట్లుగా అయిదు రూపాయల ఒప్పంద పత్రంపై టైప్ చేయించి డైరెక్టరులు సంతకం చేసిన పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ విషయంలో చాలా ఆందోళనగా ఉన్నాను. నేను ఏ విధంగా ప్రయత్నం చేస్తే నా యొక్క డబ్బు తిరిగి వస్తుందో సవివరంగా తెలుపగలరు.

– జి.శ్రీనివాసరెడ్డి, నల్గొండ.

ఏ కంపెనీ అయినా నష్టాల్లో కూరుకుపోయినట్లయితే, వాటి యాజమాన్యాలు సరియైన చర్య తీసుకొని కంపెనీ అభివృద్ధి పథంలో నడిపించలేకపోతే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ లిక్విడేటర్‌ను అప్పాయింట్ చేస్తారు. ఆ కంపెనీ యొక్క సదరు లావా దేవీలు, అన్నియు లిక్విడేటర్ చూస్తారు. (బ్యాంక్ లయితే ప్రభు, కో-ఆపరేటివ్ బ్యాంకులయితే కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ గారి ఆధ్వర్యంలో జరుగుతాయి.) మీరు సదరు కంపెనీ ఆఫీసు తెరచివుంటే దాంట్లోగాని, లేదా కోర్టులోని లిక్విడేటర్ కార్యాలయంలో గాని సంప్రదిస్తే మీకు సంబంధించి వివరాలు మరియు మీ డబ్బుకి సంబంధించిన లెక్కలు తెలుసుకోవచ్చు. కోర్టు తీర్పు ప్రకారం పర్సంటేజి విధానంతో మీరు డబ్బుపొందగలుగుతారు.

చెక్కు బౌన్స్ కేసుగా విచారిస్తారు

నేను నా అవసర నిమిత్తం నాకు తెలిసిన వ్యక్తి వద్ద రు. 15,000లు అప్పుగా తీసుకున్నాను. దీనికోసం అతను నా వద్ద నుండి రు. 15,000లకు ప్రాంసరీ నోటు, రాయించుకొని, ఖాళీ బ్యాంక్ చెక్‌పై సంతకం చేయించి తీసుకున్నాడు. ప్రామిసరీ నోటుపై జాయింట్‌గా ఉన్న 2 రెవెన్యూ స్టాంపులపై సంతకం చేయించుకున్నాడు. నా యొక్క ఆర్థిక ఇబ్బందుల వలన నేను అతనికి డబ్బు చెల్లించడంలో జాప్యం జరిగింది. నేను రాసి ఇచ్చిన ప్రాంసరీ నోట్‌పై నా సంతకం ఉన్న రెండు రెవెన్యూ స్టాంపులను తీసి, మరొక ప్రాంసరీ నోటుపై అతికించి ఆ ప్రాంసరీ నోటుపై రు. 30,000 లు రాసి, బ్యాంక్ చెక్‌పై రు. 37,200లు అని రాశాడు. చెక్ బౌన్స్ చేసి నోటీసు పంపించాడు. అతను తయారు చేసిన ప్రాంసరీ నోటీసు పంపించాడు. అతను తయారు చేసిన ప్రాంసరీ నోటుపై ఉన్న సంతకం 70శాతం మాత్రమే నాది. మిగతా మూడు అక్షరాలు అతను నా సంతకం కలిసేలా చేశాడు. దీనిలో సగం సంతకం నాది. సగం సంతకం దొంగ సంతకం అయినందున నేను ఈ కేసులో నుండి బయటపడే అవకాశం ఉందా? నేను ఆ సంతకం దొంగ సంతకం అని ఏ విధంగా నిరూపించుకోవాలో వివరంగా తెలియజేయగలరని ప్రార్థిస్తున్నాను. లేకపోతే చెక్‌పై రాసిన డబ్బు మొత్తం కట్టాల్సిందేనా? అతను చెక్ బౌన్స్ కేసు వేశాడు. కాని ప్రోనోట్ పైది దొంగ సంతకం అయినందున కేసు చెల్లకుండా పోయే అవకాశం ఉందా? వివరంగా తెలియజేయగలరు.

– జి.వెంకటేశ్వర్లు, నల్గొండ

మీరు ప్రామిసరీ నోటుపై గల సంతకం మీద కాదంటున్నారు, కాని చెక్‌పై మీరు సంతకం చేశారన్నారు. ప్రస్తుతం చెక్ బౌన్స్ కేసు వేశాడు. అంటే మీ అకౌంట్‌లో డబ్బు లేకుండా చెక్కు ఇచ్చారనేది అభియోగం. విచారణ అదే పరిధిగా జరుగుతుంది కాని, మీ ప్రామిసరీ నోటు విషయం కాదు. అది సెకండరీ ఎవిడెన్స్ మాత్రమే అవుతుంది. అతడు డబ్బుల గురించి సివిల్ దావా వేసివుంటే దాంట్లో మీ వాదనకు బలం ఉంటుంది. కాని మీ కేసులో చెక్కు పై సంతకం మీదివుంది కాబట్టి మీరు కోర్టు అవతల అతనితో సెటిల్‌మెంట్ చేసుకొవడం మంచిది. బ్లాంక్ చెక్కుపై సంతకం చేసినా మీరు ఈ కేసులో విచారించబడతారు.

అప్పు తీర్చడం కూడా వారసుల బాధ్యతే

నేను ఒకామెకు ప్రామిసరీ నోటుపై రెండు సంవత్సరాల క్రితం 20 వేల రూపాయలు అప్పుగా ఇచ్చాను. అప్పటికి ఆమెకు మూడు గదుల పెంకుటిల్లుంది. సుమారు రు. 1,50,000లు విలువ చేసే ఆస్థి ఉంది. నేను అప్పు ఇచ్చిన ఆరు మాసముల తరువాత ఆమె కొడుకు మనుమడు కలిసి చెరొకభాగము ఇల్లు అంతా వాళ్ళ పేరున పూర్తి హక్కులతో రాయించుకున్నారు. ఇప్పుడు ఆమె పేరున ఏమీ లేదు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఆమెకు మాయమాటలు చెప్పి రాయించేసుకున్నారు. నాకు విషయం తెలిసి ఆమె ద్వారాగా వాళ్ళను అడిగితే, అప్పు మాకు సంబంధం లేదు అని అంటున్నారు. వాళ్ళు ఆమెతో పూర్తి హక్కులతో పట్టా రాయించుకున్నారు. ఆమె పుట్టింటి వారు ఇచ్చిన డబ్బుతో ఆమె కొనుక్కొన్నది. ఇప్పుడు నేను లీగల్‌గా ఏ విధంగా ప్రొసీడ్ అవ్వాలో తెలియపర్చవలెను.

– బి.ప్రసాద్, పిఠాపురం, తూ.గో.జిల్లా

మీరు ఆమె రిజిస్ట్రేషన్ వారి కొడుకు పై మనమడిపై చేసే సమయానికే అయితే జడ్జిమెంట్ కన్న ముందు ఆ ఆస్థి సదరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయకుండ ఆపగలిగి ఉండేవారు. ప్రస్తుతం వారిపేరు మీద రిజిస్ట్రేషన్ అయినా, మీరు ఈ వ్యక్తిపై దావా వేయండి. డిక్రి పొందినాక మీరు 12సం॥ లోపు ఎప్పుడైనా కోర్టుద్వారా పొందగలుగుతారు. ఎప్పుడైనా కోర్టు ద్వారా పొందగలుగుతారు. అప్పు చెల్లించడంలో వారసులకు కూడ బాధ్యత ఉంటుంది.

పెసరపప్పు పాయసం

కావలసిన వస్తువులు:

పెసరపప్పు	:	ఒక కప్పు
పాలు	:	రెండు కప్పులు
పంచదార	:	ఒక కప్పు
జీడిపప్పు	:	10
యాలకులు	:	ఆరు
మిరియాలు	:	కొంచెం
నీళ్ళు	:	నాలుగు కప్పులు
నెయ్యి	:	ఒక స్పూన్
కిస్‌మిస్	:	కొంచెం

తయారుచేసే పద్ధతి: పెసర పప్పును గోధుమ రంగు వచ్చే వరకు నేతిలో వేయించి వేరుగా ఉంచుకోవాలి. ఒక పాత్రలో నీళ్ళుపోసి మరగనివ్వాలి. మరుగుతున్న నీళ్ళలో పెసరపప్పు పొయ్యాలి. బాగా మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. పంచదార వేసి కరిగిపోనివ్వాలి. పంచదార కరిగిన తరువాత పాలు పోసి బాగా మరగనివ్వాలి. వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, మిరియాలు, యాలకుల పొడి కలిపి పాత్రను దించేయాలి. ఇది వేడిగా తాగితే రుచిగా ఉంటుంది.

సొరకాయ హల్వా

కావలసిన వస్తువులు:

సొరకాయ	:	ఒకటి (అరకిలో)
ఎండుకొబ్బరి	:	చిప్పలో సగం
పంచదార	:	పావు కిలో
జీడిపప్పు	:	25 గ్రాములు
కిస్‌మిస్	:	25 గ్రాములు
యాలకులు	:	పది
నెయ్యి	:	పావు కప్పు
పాలు	:	ఒక చెంచా

తయారు చేసే పద్ధతి: సొరకాయ చాలా లేతగా ఉండాలి. ఎంత లేతగా ఉంటే హల్వా అంత రుచిగా ఉంటుంది. సొరకాయను చెక్కు తీసి తురుముకోవాలి. ఇలా తురిమేటప్పుడు నీళ్ళూరతాయి. ఆ నీళ్ళను పారబొయ్యకుండా వేరే గిన్నెలో ఉంచాలి. ఒక పాత్రలో నెయ్యి వేసి కరిగిన తరవాత ఈ కోరును వేయాలి. ఐదు నిముషాల తరువాత పంచదార చేర్చాలి. ఎండు కొబ్బరి తురుమును కూడా ఇందులో వేసి ఉడకబెట్టాలి. కాయ్ని తురుముతున్నప్పుడు వచ్చిన నీళ్ళను కూడా ఇందులో పోయాలి. దీనివల్ల అదనంగా నీళ్ళు చేర్చే అవసరం ఉండదు. నీళ్ళన్నీ ఆవిరై పోవడానికి చాలా సమయం పడుతుంది. నీళ్ళన్నీ ఇంకి ఈ మిశ్రమం ముద్దకింద తయారవుతుంది. పాకం చేతికి అంటుకోకుండా ఉన్నప్పుడు పదునుకు వచ్చినట్లు లెక్క. ఇప్పుడు వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, పాలల్లో కలిపిన పచ్చ కర్పూరం, యాలకుల పొడి వేసి బాగా కలియబెట్టాలి. ఇది చల్లారిన తరువాత తింటే రుచిగా ఉంటుంది.



సంవత్సర చందా రూ. 100లు
చందాదారులు కండి
2005 మనరైతువాణి డైరీ
క్యాలెండర్ పొందండి

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

చందా మొత్తాన్ని రైతు సంఘం ప్రతినిధులకు లేదా రైతు సంఘం కార్యాలయాలలో చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136/- లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020. ☎ : 27605413, 27646580

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక